మంగళవారం
16-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 294
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అఫ్గాన్‌లో వరద బీభత్సం

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో కురిసిన భారీ వర్షాలు వరద బీభత్సాన్ని సృష్టించాయి. దీంతో 33 మంది మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. రాజధాని కాబూల్‌తో పాటు వివిధ రాష్ట్రాల్లో అకస్మాత్తుగా వరదలు సంభవించాయి. వరదల కారణంగా దేశంలో 600కు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని తాలిబాన్ ప్రతినిధి అబ్దుల్లా జనాన్ తెలిపారు. వర్షాల కారణంగా 200 పశువులు మృతిచెందాయని, 800 హెక్టార్లలోని పంటలు దెబ్బతిన్నాయన్నారు. 85 కిలోమీటర్లకు పైగా రోడ్లు దెబ్బతిన్నాయని, పశ్చిమ ఫరా, హెరాత్, సదరన్ జాబుల్, కాందహార్‌లకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. మరోపక్క అఫ్గానిస్థాన్‌లోని 34 రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఎన్నికల బాండ్లుకు
మోదీ సమర్థన

సుప్రీం తీర్పును పరిహసించేలా ప్రధాని వ్యాఖ్యలు

న్యూదిల్లీ: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్న సుప్రీంకోర్టు తీర్పును పరిహసించేలా ప్రధాని నరేంద్ర మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల బాండ్లను సమర్థిస్తూ... ఈ పథకం రద్దు విషయంలో ప్రతి ఒక్కరూ చింతిస్తారని ఓ జాతీ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఎన్నికల బాండ్ల అంశంతో పాటు దేశ భవిష్యత్తు ప్రణాళికలపై కూడా వివరించారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా రాజకీయ పార్టీల నగదు లావాదేవీలకు స్పష్టమైన మార్గం ఏర్పడిందన్నారు. దీనిపై నిజాయితీగా ఆలోచిస్తే... వీటి రద్దుపై ప్రతిఒక్కరూ బాధ పడతారని రాజకీయ పార్టీలనుద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు బడ్డు ఖర్చు చేస్తాయన్న మోదీ... నల్లధనాన్ని అరికట్టేందుకు తన మనసులో వచ్చిన స్వచ్ఛమైన ఆలోచనే ఎన్నికల బాండ్లు అంటూ గొప్పలు పోయారు. మరోవైపు నల్లధనం నిర్మూలన లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇదే సరైన మార్గం అని తాను ఎన్నడూ చెప్పలేదని ప్రధాని తెలిపారు. ఈ పథకం కారణంగా బీజేపీకే ఎక్కువ ప్రయోజనం చేకూరిందని ప్రతిపక్షాలు ఆరోపించడాన్ని తప్పు బట్టారు. బాండ్ల అంశంపై అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. 'నిర్ణయాలు తీసుకోవడంలో లోటుపాట్లు ఉండవని నేను ఎప్పుడూ చెప్పలేదు. లోటుపాట్లు ఉంటే వాటిపై చర్చించి మెరుగుపరుచుకుంటాం. ఈ విషయంలోనూ (ఎన్నికల బాండ్ల పథకం) మెరుగుపరచుకునేందుకు ఎంతో అవకాశం ఉంది. ఈరోజు దేశాన్ని నల్లధనం వైపు మనం నెట్టేశాం. ఇది పశ్చాత్తాపపడాల్సిన

- మిగతా 2 లో

ఎన్నికలు...
డబ్బు మూటలు

రోజుకు రూ.100 కోట్లు పట్టివేత

- ఓటింగ్‌కు ముందే రూ.4,650 కోట్ల సొత్తు స్వాధీనం
- జనవరి నుంచి లెక్కిస్తే.... రూ.12 వేల కోట్లు
- ఏపీలో రూ.125.97 కోట్లు... తెలంగాణలో రూ.121.84 కోట్లు
- 2019 ఎన్నికల నాటికంటే ఎక్కువ

న్యూదిల్లీ: ఎన్నికల వేళ ధనం గుట్టలు గుట్టలుగా బయటపడుతోంది. ఓటర్లకు పంచేందుకు, విచ్చలవిడిగా ఖర్చు చేసేందుకు రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థులు పెద్ద మొత్తంలో డబ్బును చాటుమాటుగా తరలిస్తూ ఈసీకి చిక్కుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అక్రమ నిధుల స్వాధీనం గురించి దిగ్భ్రాంతికరమైన గణాంకాలను వెల్లడించింది. మార్చి 1 నుంచి ప్రతిరోజూ తమ పర్యవేక్షణలో అధికారులు రూ.100 కోట్ల విలువైన సొత్తు జప్తు చేస్తున్నారని ఎన్నికల సంఘం సోమవారం తెలిపింది. పోలింగ్ ప్రారంభం కావడానికి ముందే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రూ.4,650 కోట్లను స్వాధీనం చేసుకున్నారని, 2019 ఎన్నికల్లో చేసిన మొత్తం జప్తుల కంటే ఇది ఎక్కువ అని కమిషన్ పేర్కొంది. '2024 సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నందున, దేశంలో 75 ఏళ్ల లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మొత్తం నమోదయింది' అని ఇది ఒక ప్రకటనలో తెలిపింది. 18వ లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ఈనెల 19వ తేదీ శుక్రవారం ప్రారంభం కావడానికి ముందే ధనబలాన్ని తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు రికార్డు స్థాయిలో రూ.4,650 కోట్లను స్వాధీనం చేసుకున్నాయి. 2019లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ మొత్తం సమయంలో స్వాధీనం చేసుకున్న రూ.3475 కోట్ల కంటే ఈసారి ఆరంభంలోనే ఆ మొత్తం పెరిగింది. ఈ ఏడాది మొత్తం జప్తులో సింహభాగం మాదకద్రవ్యాలదే కావడం గమనార్హం. రూ.4,650 కోట్ల జప్తులో 45 శాతం మేర మాదక ద్రవ్యాలే ఉన్నట్లు ఈసీ తెలిపింది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుంటారన్న విషయం తెలిసిందే. తమ గెలుపు కోసం ఓటర్లకు డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాలు, బంగారం, వెండి, ఖరీదైన వస్తువులను ఇస్తుంటారు. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధం. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రలోభాలను కట్టడి చేసేందుకు తమ వంతు ప్రయత్నిస్తుంటుంది. ఈసీ ప్రతి రాష్ట్రంలో ఎన్నికల

- మిగతా 2 లో

23 వరకు
జైల్లోనే కేజ్రీవాల్

- మద్యం కేసులో కస్టడీ పొడిగించిన ప్రత్యేక కోర్టు
- అరెస్టుపై వివరణ ఇవ్వాలని ఈడీకి సుప్రీం నోటీసు

న్యూదిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టుల్లో ఊరట లభించలేదు. ఏప్రిల్ 23 వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ దిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయగా... ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏప్రిల్ 29వరకు విచారణ చేయడం కుదరదని చెబుతూ... కేజ్రీవాల్ అరెస్ట్‌పై వివరణ ఇవ్వలంటూ ఈడీకి నోటీసులు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ మరికొన్ని రోజులు జైలులోనే ఉండనున్నారు. దిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్‌కు ప్రత్యేక న్యాయస్థానం విధించిన 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ సోమవారంతో ముగిసింది. దీంతో ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను దిల్లీ కోర్టులోని సీబీఐ, ఈడీ ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ముందు వీడియో

- మిగతా 2 లో

మోదీని ఇంటికి సాగనంపుదాం
రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

రాజమండ్రి సభలో వక్తల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో– రాజమహేంద్రవరం: దేశంలో ఇండియా కూటమి విజయం సాధించాలని, అందులో తొలి విజయం రాజమహేంద్రవరానిదే కావాలని, ఇందుకోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోదీని ఇంటికి సాగనంపాలని, అప్పుడే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని స్పష్టంచేశారు. స్థానిక ఆనం రోటరీ హాల్‌లో ఇండియా కూటమి తూర్పుగోదావరి జిల్లా ఆత్మీయ సమావేశం సందర్భంగా లౌకిక రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణ సభ జరిగింది. సభకు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముందుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. తాజాగా మోదీ గ్యారెంటీ పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి బీజేపీ కొత్త మేనిఫెస్టోతో ముందుకు వచ్చిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం, రాజధాని నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తామని నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత అందులో ఒక్కటీ అమలు చేయలేదని

- మిగతా 2 లో

జగన్‌పై దాడి చేసిందెవరు?

- కేసు దర్యాప్తు వేగవంతం
- రంగంలోకి 8 ప్రత్యేక పోలీసు బృందాలు
- ఇప్పటికే 50 మందికి పైగా అనుమానితుల విచారణ
- ఎయిర్‌గన్, క్యాట్ బాల్ వినియోగదారులపైనా ఆరా
- ఆచూకీ తెలిపితే రూ.2 లక్షల బహుమతి ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై రాయి విసిరిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందుకోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటయి ఆధారాలు సేకరిస్తోంది. ప్రత్యక్ష సాక్షుల నుంచి స్టేట్‌మెంట్స్ రికార్డు చేయిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి కేసు దర్యాప్తును ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అంత దూరం నుంచి జగన్‌కు తగిలేలా రాయి ఎలా విసిరారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. దాడి జరిగిన ప్రాంతంలో అనుమానితుల ఇన్‌కమింగ్, ఔట్‌గొయింగ్ కాల్స్‌ను పరిశీలిస్తున్నారు. అదే రోజు ఆ ప్రాంతం నుంచి ఒకే నంబరు ద్వారా ఎక్కువ కాల్స్ వెళ్లిన, వచ్చిన వాటిపై కూడా ఆరా తీస్తున్నారు. ఘటన జరిగిన గంగానమ్మ గుడి దగ్గర సెల్‌టవర్ నుంచి గత 15 రోజులుగా పోలీసులు అనుమానిస్తున్న వారి కాల్స్‌ను పరిశీలిస్తున్నారు. రాయి చేతితో విసిరారా? లేక ఎయిర్‌గన్? క్యాట్‌బాల్? ను ఉపయోగించారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో వీటిని ప్రత్యేకంగా వినియోగించే వారి కోసం కూడా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీఎం వాహనానికి ఉన్న సీసీ టీవీ ఫుటేజ్‌తో పాటు పోలీస్ వాహనాలకు ఉన్న సీసీ ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాహనాలకు కెమెరాలు ఉన్నప్పటికీ ఫోకస్ లైట్స్ కారణంగా వీడియోలు స్పష్టంగా కనిపించడం లేదు. గంగానమ్మ గుడి ఐసోలేషన్ లోకేషన్‌లో కాల్ డేటాను, సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు. ఈ కేసు విచారణలో అనుభవజ్ఞులైన కమిషనరేట్ ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగి అణువణువూ

- మిగతా 2 లో

న్యాయవ్యవస్థ పరిరక్షణ
మన బాధ్యత

- స్వప్రయోజనాల కోసం నేతల విపరీత ధోరణులు
- సీజేఐకి రిటైర్డు న్యాయమూర్తుల లేఖ

న్యూదిల్లీ: న్యాయవ్యవస్థను భ్రష్టుపట్టించడానికి, దాని పవిత్రతను మంటగలపడానికి కొంతమంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కి లేఖ రాశారు. దీనిని నియంత్రించడానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందులో రాజకీయ పార్టీలు, బలవంతులు ఉన్నారని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను కాపాడుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయని అభిప్రాయపడ్డారు. కొన్ని వర్గాలు తప్పుడు సమాచారం అందిస్తూ న్యాయ వ్యవస్థను బహిరంగంగా అవమానిస్తున్నారని, అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కొందరు తమ వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం విపరీత చర్యలకు పాల్పడుతున్నారని, దానివల్ల ప్రజలు న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సింపతీ వస్తుంది,బానే వుంది, కానీ
రెండు రాళ్లకే ఇన్ని దెబ్బలు
తగిలాయంటే జనం నమ్ముతారంటారా?

నిఘా నీడలో బస్సు యాత్ర



- అదనపు భద్రతా చర్యలు
- దాడి ఘటన తర్వాత జనంలోకి జగన్
- ఇలాంటి దాడులు నన్ను ఆపలేవు : సీఎం
- 24న శ్రీకాకుళం జిల్లాలో 'మేమంతా సిద్ధం' పూర్తి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : 'మేమంతా సిద్ధం' పేరుతో వైసీపీ అధినేత, సీఎం జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు అదనపు భద్రత కల్పించారు. దాడి ఘటన తర్వాత మళ్లీ జనంలోకి సీఎం బయల్దేరారు. దీంతో భద్రతలో భారీ మార్పులు చేపట్టారు. ఈనెల 13న విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ దగ్గర సీఎంపై జరిగిన దాడి సంఘటనలో సీఎం కంటిపై భాగాన గాయమైంది. వైద్యుల సూచనల మేరకు 14వ తేదీ ఆదివారం బస్సు యాత్రకు ఒక రోజు విరామం ఇచ్చారు. దీంతో 15న ఉమ్మడి కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం కేసరపల్లి నుంచి జగన్ బస్సు యాత్ర ప్రారంభమైంది. దారిపొడవునా జగన్ నిర్వహించిన రోడ్ షోకు ప్రజలు తరలివచ్చారు. గతం కంటే యాత్రలో అదనపు భద్రతను పెంచారు. సీఎం వెళ్లే మార్గంలో డీఎస్పీలతో భద్రతా చర్యలు చేపట్టారు. ఇందుకోసం వివిధ జిల్లాల నుంచి డీఎస్పీలను రప్పించారు. జగన్ వెళ్లే మార్గాలను సెక్టార్ల వారీగా విభజించారు. ఒక్కో సెక్టారుకు ఒక

- మిగతా 2 లో

పెత్తందార్లను ఓడించండి

- పేదలపక్షాన నిలిచిన మీ బిడ్డను ఆశీర్వదించండి
- 99 శాతం హామీల అమలు ఘనత వైసీపీదే
- 'సంక్షేమం' ఇంటిముంగిటకు రావాలంటే ఫ్యాన్‌కే ఓటేయండి
- మేమంతా సిద్ధం సభలో జగన్ పిలుపు

2లో

ఆత్మరక్షణ
కోసమే దాడులు

- భద్రతామండలిలో ఇరాన్ ప్రతినిధి వివరణ
- టెహ్రాన్‌పై వీలైనన్ని ఆంక్షలు విధించాలన్న ఇజ్రాయిల్
- ప్రతిదాడులకు దిగితే సహకరించబోమన్న అమెరికా

2లో

23 వరకు జైల్లోనే కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. విచారణ కీలక దశలో ఉందని, మరో 14 రోజులు కస్టడీని పొడిగించాలని ఈడీ కోర్టును కోరింది. బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితతో సహా కొంతమంది సహ నిందితుల జ్యుడీషియల్ కస్టడీ ఏప్రిల్ 23తో ముగుస్తుందన్న ఈడీ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఆ తేదీ వరకు కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఏప్రిల్ 24లోగా వివరణ ఇవ్వాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29 తర్వాత చేపడతామని ధర్మాసనం పేర్కొంది. అంతకుముందు కేజ్రీవాల్ పిటిషన్‌పై తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదనలు వినిపించారు. న్యాయస్థానం మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురి చేసేలా కొన్ని వాస్తవాలను కోర్టుకు చూపించాలనుకుంటున్నట్లు చెప్పారు. కొన్ని సెలెక్టివ్ లీక్‌లు ఉన్నాయని చెబుతూ... వచ్చే శుక్రవారం విషయాన్ని వినవలసిందిగా అభ్యర్థించారు. అయితే తనకు అలాంటిదేమీ కనిపించలేదని జస్టిస్ ఖన్నా అన్నారు. 'మేము మీకు సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో విచారణ తేదీ నిర్ణయిస్తాము. కానీ మీరు సూచించిన తేదీన సాధ్యం కాదు' అని తెలిపారు. సింఘ్వీ మాట్లాడుతూ... ఇది అసాధారణ విషయమని, ఆయన ముఖ్యమంత్రి అయినందుకు కాదని అన్నారు. సీబీఐ, ఈడీ మద్యం కేసులో ఎనిమిది చార్జిషీట్లు దాఖలు చేసినప్పటికీ వాటన్నింటిలో కేజ్రీవాల్ పేరులేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కథ సెప్టెంబర్ 2022 నుంచి ప్రారంభమైతే కేజ్రీవాల్‌ను 2024 మార్చి 16న అరెస్టు చేశారన్నారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ద్వారా తొమ్మిది, ఇతరులను ఆరు.. మొత్తం 15 స్టేట్‌మెంట్‌లు దర్యాప్తు సంస్థల వద్ద ఉన్నాయని...అందులో కేజ్రీవాల్ పేరు పేర్కొనలేదన్నారు. తదుపరి తేదీకి తన వాదనలను రిజర్వ్ చేయమని జస్టిస్ ఖన్నా సింఘ్వీని కోరడంతో... ఎన్నికల్లో ప్రచారం చేయనీయకూడదన్న లక్ష్యంతోనే మార్చి16న కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని సింఘ్వీ పేర్కొన్నారు. కాగా ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదనలు వినిపించారు.

న్యాయవ్యవస్థ పరిరక్షణ మన బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

మాటలయుద్ధం, ప్రతిపక్షాలపై అవినీతి కేసులు, బాధిత నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించినా వారికి ఎటువంటి ఉపశమనం దక్కకపోవడం వంటి అంశాలను ఆ మాజీ న్యాయమూర్తులు తమ లేఖలో ప్రస్తావించారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ పద్ధతులు చోటుచేసుకునేలా కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ పవిత్రతను అగౌరవ పరుస్తాయని తెలిపారు. అనవసర ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం మనపైనే ఉందని రిటైర్డ్ న్యాయమూర్తులు పేర్కొన్నారు. కొన్ని రాజకీయ సమూహాలు న్యాయవ్యవస్థను దెబ్బతీసేలా నిరాధారమైన సిద్ధాంతాలు ప్రచారం చేస్తూ, తమ అనుకూల ఫలితాలు పొందేలా వ్యూహాలు రచిస్తున్నారన్నారు. ప్రస్తుతం అరెస్టవుతున్న రాజకీయ నాయకుల విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఒకరి అభిప్రాయాలకు అనుగుణంగా న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడం, అలా చేయనివారిని తీవ్రంగా విమర్శించడం, న్యాయ సమీక్ష చేయడం చట్ట నియమాల సారాంశాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు నేతృత్వంలోని న్యాయవ్యవస్థ ఇటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా న్యాయవ్యవస్థ పవిత్రత, స్వయం ప్రతిపత్తిని కాపాడాలని వారు కోరారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా, అస్థిరమైన రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఉంటుందని రిటైర్డ్ న్యాయమూర్తులు వివరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణ విమర్శించారు. దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు మోదీ సర్కారు కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. రుణమాఫీ చేయాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెప్పుకొచ్చిందని, కానీ కార్పొరేట్ సంస్థలకు మాత్రం వేలకోట్ల రుణాలు మాఫీ చేసిందని నిందించారు. మోదీ సర్కారు అక్రమాలపై ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలతో బెదిరిస్తోందని, జైళ్లకు పంపుతోందని రామకృష్ణ చెప్పారు. బీజేపీని వ్యతిరేకిస్తే...ముఖ్యమంత్రులను సైతం కటకటాల వెనక్కి పంపిందని వివరించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నాలుగున్నరేళ్లకు పైగా నియంత చేతికి చిక్కిందని, రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని విమర్శించారు. వ్యవసాయ, పారిశ్రామిక, నీటిపారుదల రంగాల అభివృద్ధి అటకెక్కిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. ప్రత్యేకహోదా కోసం కేంద్రం మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికిన జగన్...అధికారం చేపట్టిన తర్వాత మాట తప్పి...మడమ తిప్పారని ఆయన విమర్శించారు ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు ఇండియా కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఇండియా కూటమి గెలుపు ఏపీ అభివృద్ధికి మలుపుగా ఆయన అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో ప్రజాకంటక పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించేందుకు ప్రతిఒక్కరూ దీక్షబూనాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశంలో ముఖ్యమంత్రి అరెస్ట్ అయిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని, బీజేపీని వ్యతిరేకించడం వల్లే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ క్రేజీవాల్ జైలు పాలయ్యారని చెప్పారు. బీజేపీ వ్యతిరేకులపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను ప్రయోగిస్తున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క శాతం కూడా ఓటు బ్యాంకు లేని బీజేపీతో టీడీపీ జతకట్టడం వెనక రహస్యం ఉందన్నారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్లే బీజేపీతో టీడీపీ కలిసిందని, అందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మరోమంత్రి బీజేపీ పెద్దలతో ఢిల్లీలో మంతనాలు జరిపారని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు. అందుకుగాను రాజమండ్రి బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి జిల్లా ప్రజలు చెవిలో పూలతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. పురందేశ్వరని చిత్తుగా ఓడించాలన్నారు. సభలో కాంగ్రెస్ నాయకుడు జంగా గౌతమ్, ప్రముఖ రచయిత డీవీఎస్ వర్మ, సీపీఐ నాయకుడు కుంద్రపు రాంబాబు, సీపీఎం నాయకుడు బి.పవన్, కూటమి నాయకులు వి.కొండలరావు, తులసి, జువ్వల రాంబాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు బోడ వెంకట్, బలేపల్లి మురళీధర్, అరుణకుమారి, మార్టిన్ లూథర్ ప్రసంగించారు.

జగన్‌పై రాయి దాడి పెద్ద డ్రామా : చింతమనేని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్‌పై రాయిదాడి పెద్ద డ్రామా అని, దీని వెనుక స్క్రీన్ ప్లే, డైరెక్షన్ సజ్జల రామకృష్ణారెడ్డి అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆరోపించారు. మంగళగిరి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సానుభూతి కోసం పక్కా ప్రణాళికతో ఈ దాడి డ్రామాకు తెరదీశారన్నారు. జగన్‌తో వారి కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని... అందుకే ఆమె తల్లి విజయమ్మ భయపడి విదేశాలకు పారిపోయారని చెప్పారు. ఎన్నికల్లో జగన్‌కు ఓటమి భయం పట్టుకున్నందునే కోడి కత్తి డ్రామాకు సీక్వెల్‌గా ఈ రాయి దాడి డ్రామాకు తెరలేపారన్నారు. రాళ్ల దాడి జరుగుతుంటే పోలీసు, నిఘా వ్యవస్థ ఏం చేస్తోందని ప్రశ్నించారు. దాడి చేసిన వ్యక్తిని ఎందుకని అదుపులోకి తీసుకోలేదు?, దాడి చేసిన రాయి ఏమైందని చింతమనేని ప్రశ్నించారు. జైలు నుంచి బయటకు వచ్చేందుకు భాస్కర్‌రెడ్డి భయపడుతున్నారన్నారు. ఈ డ్రామాల నేతలకు సూత్రధారుడు సజ్జలేనని ఎద్దేవా చేశారు.

ఆత్మరక్షణ కోసమే దాడులు

జెరూసలేం: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి వేదికగా ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఐరాస నిర్వహించిన భద్రతామండలి అత్యవసర సమావేశంలో ఇజ్రాయిల్‌పై తాజా దాడుల్ని ఇరాన్ సమర్థించుకుంది. కేవలం ఆత్మరక్షణ కోసమే ఇజ్రాయిల్‌పై దాడులకు దిగాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. ఈ క్రమంలో భద్రతా మండలి వైఫల్యాన్ని ఇరాన్ ఎండగట్టింది. 'అంతర్జాతీయ శాంతిని నెలకొల్పడం భద్రతా మండలి బాధ్యత. కానీ, గత కొన్ని నెలలుగా ఆ బాధ్యతల్ని నిర్వర్తించడంలో భద్రతా మండలి ఘోరంగా విఫలమైంది. గత్యంతరం లేకనే ఆత్మరక్షణ కోసం ఇరాన్, ఇజ్రాయిల్‌పై ప్రతిదాడులకు పాల్పడాల్సి వచ్చింది. మా దేశం యుద్ధాన్ని, యుద్ధ వాతావరణాన్ని కోరుకోదు. కానీ, బెదిరింపులకు, ఆక్రమణలకు, దాడులకు తెగబడితే మాత్రం గట్టిగానే స్పందిస్తుంది అని ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ ప్రతినిధి అమీర్ సయీద్ ఇర్వానీ తెలిపారు. ముందు సిరియాలోని తమ కాన్సులేట్ భవనంపై దాడి జరిగిందన్న ఆయన, ఆత్మరక్షణ హక్కులో భాగంగా ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 నిబంధన ప్రకారం దాడులు నిర్వహించినట్లు ప్రకటించారు. పౌరులకు ఏ నష్టం జరగకుండా సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. తమ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ ఉగ్రదాడి చేసినప్పుడు ఏ దేశం ఖండించలేదన్నారు. ఆ సమయంలో అంతర్జాతీయ శాంతిభద్రతను కాపాడటంలో భద్రతా మండలి విఫలమైందన్నారు. అయితే ఇరాన్ చేసిన అసాధారణ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సమావేశంలో అమెరికా, బ్రిటన్ ప్రకటించాయి. ఈ దాడి దారుణమైందన్న బ్రిటన్ రాయబారి మధ్యప్రాచ్య పౌరభద్రత స్థిరత్వాలకు ఇది ప్రమాదం కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. ఇరాన్ చర్యలు ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఇజ్రాయిల్ రాయబారి గిలాడ్ ఎర్డాన్ మండలిలో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఆధిపత్యం కోసం ఇరాన్ తపిస్తోందన్నారు. ఉగ్రవాదానికి నంబర్ వన్ గ్లోబల్ స్పాన్సర్ అయిన ఇరాన్‌పై వీలైనన్ని ఆంక్షలు విధించాలని కోరారు. ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ఇజ్రాయిల్ చట్టపరమైన అన్ని హక్కులను కలిగి ఉందన్నారు. కాగా బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో తమపై విరుచుకుపడ్డ ఇరాన్‌పై తగిన సమయంలో తగు రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఇజ్రాయిల్ మంత్రి బెన్నీ గంట్జ్ తాజాగా ప్రకటించారు. అయితే ఇరాన్‌పై ప్రతిదాడులు చేయొద్దని ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం అమెరికా స్పష్టం చేసింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను సమర్థంగా తిప్పికొట్టిన తర్వాత ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఫోన్లో మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లో ఇరాన్‌పై దాడి చేయవద్దని సూచించిన బైడెన్... మాట వినకుండా ఆ పని చేస్తే అమెరికా ఎలాంటి సహకారం అందించబోదని స్పష్టం చేశారు. మెజారిటీ డ్రోన్లు, క్షిపణులను కూల్చడమే ఇజ్రాయిల్‌కు అతిపెద్ద విజయమని బైడెన& వివరించారు. టెల్ అవీవ్‌కు నష్టం జరగనందున ప్రతిదాడులు అనవసరమని పేర్కొన్నారు.

ఇరాన్‌పై ప్రతీకార చర్యలొద్దు: గుటెర్రస్

అనంతరం ప్రసంగించిన ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్... పశ్చిమాసియా ప్రజలు ఇప్పటికే వినాశకర, తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇరాన్‌పై ప్రతీకార చర్యలకు దిగి ఉద్రిక్తతలను మరింత పెంచవద్దని సభ్యదేశాలకు విజ్ఞప్తి చేశారు. అక్కడ మరిన్ని యుద్ధాలు జరిగితే పశ్చిమాసియాతోపాటు ప్రపంచం కూడా వాటిని భరించలేదని హితవు పలికారు. ఏప్రిల్ ఒకటో తేదీన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయ భవనంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి నిర్వహించింది. ఆ దాడిలో టాప్ కమాండర్ సహా ఏడుగురు ఇరాన్ సైనికులు మరణించారు. అప్పటి నుంచి ప్రతీకారంతో రగిలిపోయిన ఇరాన్, ఇజ్రాయిల్‌ను శిక్షిస్తామని చెబుతూ వచ్చింది. తాము చేపట్టబోయే చర్యలకు అమెరికా దూరంగా ఉండాలని హెచ్చరించింది. అన్నట్లుగానే 13వ తేదీన రాత్రి వందల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులను ఇజ్రాయిల్‌వైపు ప్రయోగించింది. అందులో 99 శాతం అమెరికా, బ్రిటన్, ఇజ్రాయిల్ కలిసి ఆకాశంలోనే ధ్వంసం చేశాయి.

భారతీయ సిబ్బందికి ఊరట

ఇజ్రాయిల్ తో ఉద్రిక్తతల వేళ భారత్‌కు వచ్చే ఓ నౌకను ఇరాన్ స్వాధీనం చేసుకోవడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. అందులోని భారతీయ సిబ్బందికి టెహ్రాన్ కాస్త ఊరటనిచ్చింది. మన దేశ అధికారులు వారిని కలిసేందుకు అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. గత శనివారం హర్మూజ్ జలసంధి సమీపంలో ఇజ్రాయిల్ కుబేరుడికి చెందిన వాణిజ్య నౌక ఎంఎస్‌సీ ఏరిస్‌ను ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ దళం హెలికాప్టర్లతో వెంబడించి అధీనంలోకి తీసుకొంది. నౌకలో మొత్తం 25 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 17 మంది భారతీయులే. ఈ క్రమంలోనే వారిని రక్షించేందుకు మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆదివారం ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దుల్లాహియాన్‌తో మాట్లాడారు. నౌకలోని భారతీయులను విడుదల చేయాలని కోరారు. పశ్చిమాసియాలో ఘర్షణలను నివారించాలని, దౌత్య మార్గాల్లో పరిష్కారం కనుగొనాలని ఆయన సూచించారు. ఈ పరిణామాల వేళ ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం దీనిపై ఓ ప్రకటన జారీ చేసింది. "స్వాధీనం చేసుకున్న నౌక వివరాలను తెలుసుకుంటున్నాం. త్వరలోనే అందులోని భారతీయ సిబ్బందిని న్యూదిల్లీ ప్రతినిధులు కలిసేందుకు ఏర్పాట్లు చేస్తాం" అని వెల్లడించింది. ప్రస్తుతం ఆ నౌక ఇరాన్ ప్రాదేశిక జలాల్లో ఉంది.

పెత్తందార్లను ఓడించండి

విశాలాంధ్ర-గుడివాడ : పెత్తందార్ల కూటమి ఓ వైపు... పేదల పక్షాన మంచికోసం నిలబడ్డ మీ బిడ్డ ఒక్కడే ఓ వైపు ... ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే ఇల్లుతట్టి అందించిన సంక్షేమ పథకాలు మరలా మీ ఇంటి ముంగిటకు రావాలంటే మీ బిడ్డను మరోసారి ఆశీర్వదించాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు. 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచారయాత్ర సందర్భంగా సోమవారం కృష్ణాజిల్లా గుడివాడలోని నాగవరప్పాడు కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ గుడివాడ ప్రజలను చూస్తుంటే మంచి కోసం నిలబడిన మహా సముద్రంగా కనిపిస్తుందన్నారు. తాను ముఖ్యమంత్రిగా 58 నెలల పాలనలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను అభివృద్ధిపర్చడమే కాకుండా అర్హుల ఇంటికే సంక్షేమ ఫలాలను అందజేసినట్టు చెప్పారు. తనను ఒక్కడిని చేసి ఓడించేందుకు, టీడీపీ అధినేత చంద్రబాబు ... బీజేపీ, జనసేన పార్టీలతో కూటమిగా ఏర్పడి చక్రవ్యూహం పన్నారన్నారు. ఈ వ్యూహంలో కాంగ్రెస్ ఏమాత్రం తీసిపోదన్నారు. ఎంత మంది మీ బిడ్డపైకి వచ్చినా కష్టావతారంలో ఉన్న ప్రజల మద్దతు తనకు ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరన్నారు. అర్జునుడిలా గెలిచి తిరిగి తాను సీఎం అవుతానన్నారు. నాపై ఒక రాయి విసిరినంత మాత్రానా అదరను, బెదరను అన్నారు. ఇలాంటి తాటకు చప్పుళ్లకు బెదిరే ప్రస్తకి లేదన్నారు.

వలంటీర్ల వ్యవస్థ ద్వారా లంచంలేని పాలన మీ ఇంటి ముంగిటికే తీసుకువచ్చానన్నారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితం... 14 ఏళ్ల ముఖ్యమంత్రి పాలనలో చేసింది శూన్యమన్నారు. పెత్తందారులు మళ్లీ ఓట్ల కోసం మీ ముందుకు వచ్చారు... మోసపోవద్దని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసగించిన చంద్రబాబును పూర్తిగా ఇంటికి పంపాలన్నారు. సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేసేందుకు ముగ్గురు కలిసికట్టుగా వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలన్నారు. తన పాలనలో ఎక్కడా అవినీతి జరగకుండా అన్ని సంక్షే పథకాలు నేరుగా ప్రజల ఖాతాలకే చేర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. మీ ఇంటికి 10 అడుగుల దూరంలోనే 600 రకాల సేవలను సచివాలయాల ద్వారా తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. విత్తనం నుంచి అమ్మకాలు జరిపే వరకు వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చానని చెప్పుకొచ్చారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, నాడు- నేడు, ఇంగ్లీష్ మీడియం, విద్యా కానుక, గోరుముద్ద, బైలింగ్వల్ బుక్స్, ఐఎఫ్పీతో డిజిటల్ బోధన, ట్యాబ్స్, టోఫెల్, వంటి చదువులు మన కళ్ల ముందే జరిగాయంటే అవన్నీ మీ బిడ్డ పాలనలోనే అని గుర్తుపెట్టుకోవాలన్నారు. విలేజ్ క్లీనిక్, ఫ్యామిలి డాక్టర్, ఆరోగ్య సురక్ష , ప్రభుత్వ ఆసుపత్రుల్లో 54 వేల నియామకాలు చేపట్టామన్నారు. 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నట్టు వివరించారు. మచిలీపట్నం సీపోర్టు నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయన్నారు. కొత్త ఎయిర్ పోర్టులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి అవుతున్నాయన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత వైసీపీదేనన్నారు. మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మీరే కదిలి వచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు, 25కి 25 ఏంపీ స్థానాలు గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. బందరు పార్లమెంట్ పరిధిలోని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పేర్ని కిట్టు, ఉప్పల రాము, సింహాద్రి రమేశ్ బాబు, జోగి రమేశ్, కైలే అనిల్, వల్లభనేని వంశీ, కొడాలి నాని, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌లకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారిక, ఎమ్మెల్యేలు మేకా ప్రతాప్, దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తలసిల రాఘురామ్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల సామిదాసు, తాతినేని పద్మావతి పాల్గొన్నారు.

జగన్‌పై దాడి చేసిందెవరు?

(మొదటిపేజీ తరువాయి)

గాలిస్తున్నారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల కదలికలపై కూడా ఆరా తీస్తున్నారు. అయితే అజిత్‌సింగ్‌నగర్ దగ్గర వివేకానంద స్కూల్, గంగానమ్మ గుడికి మధ్య ఉన్న ఖాళీ ప్రదేశం నుంచే దాడి జరిగినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దానికనుగుణంగా ఇప్పటికే దాదాపు 50 మందికి పైగా అనుమానితులను పోలీసులు విచారించారు. నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి దగ్గర నుంచి సమాచారాన్ని రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. ఇప్పటికే జగన్‌పై జరిగిన దాడి సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆరా తీశాయి. ఈ ఘటనపై సీఈవోకు విజయవాడ నగర సీపీ క్రాంతి రాణా టాటా ప్రాథమిక నివేదిక అందజేశారు. ఈ కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసి సమగ్ర నివేదికను అందజేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఇతర ప్రముఖ వ్యక్తుల పర్యటనల్లో ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సీపీ రాణాను, ఐజీ రవి ప్రకాశ్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు.

ఈ నంబర్లకు సమాచారమిస్తే రూ.2 లక్షల బహుమతి

ఈ కేసు దర్యాప్తులో భాగంగా జగన్‌పై దాడి చేసిన నిందితుల సమాచారం చెప్పిన వారికి ఎన్టీఆర్ జిల్లా పోలీసులు నగదు బహుమతిని ప్రకటించారు. దాడికి సంబంధించి కచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. సంఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలు ఉన్నా పంపవచ్చు. నిందితుల వివరాలను 9490619342, 9440627089 నంబర్లకు ఫోన్ చేయాలి. మొత్తం మీద జగన్ దాడి కేసులో కీలక సమాచారం కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు.

సీఎం బస్సు రూఫ్ మీద నిలబడటం వల్లే కరెంట్ తీశాం : సీపీ రాణా

విజయవాడ నగర పరిధిలో దాదాపు 22 కిలోమీటర్ల పొడవునా సీఎం జగన్ బస్సు రూఫ్ మీద నిలబడి రోడ్ షో చేశారని, రహదారి మార్గంలో అనేక కేబుల్స్, కరెంట్ తీగలు ఉన్నందున భద్రతా చర్యల్లో భాగంగా ఆయన ప్రయాణించే మార్గాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు పురోగతిని వివరించారు. జగన్ బస్సు యాత్రను పురస్కరించుకుని 1,480 మంది పోలీసు బలగాలను భద్రతకు ఉపయోగించినట్లు వెల్లడించారు. ఇవిగాక 400 మందితో 40 రోప్ పార్టీలు పెట్టామని తెలిపారు. చీకట్లో రాయి విసిరిన వ్యక్తిని కనుక్కోవడం తేలికైన పని కాదని, అయినప్పటికీ త్వరలోనే ఆ వ్యక్తిని పట్టుకుంటామన్నారు. రాయి తగలరాని చోట తగిలితే పెద్ద ప్రమాదమే జరిగేదని, అందుకే హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ఈ ఘటనలో దోషులను పట్టుకోవడానికి ప్రజలు కూడా సహకరించాలని, సమాచారం తెలియజేసిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని, రూ.2 లక్షల నగదు బహుమతి అందజేస్తామని సీపీ తెలిపారు.

డబ్బు మూటలు

(మొదటిపేజీ తరువాయి)

ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తూ డబ్బు, మద్యం రవాణాను కట్టడి చేస్తుంటుంది. ఈ క్రమంలో దేశంలో ఎన్నికల సమయంలో కట్టల కొద్దీ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు పట్టుపడుతుంటాయి. అయితే ఈ సారి మాత్రం రికార్డు స్థాయిలో జప్తు జరిగింది.

నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, విలువైన వస్తువులు, ఉచిత తాయిలాలు...

ఈసీఐ వెల్లడించిన వివరాల ప్రకారం, మార్చి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు తొలి విడతలో డబ్బు, మద్యం, బంగారం, ఇతర వస్తువుల రూపంలో మొత్తం రూ.4,650 కోట్లు జప్తు చేయడం జరిగింది. అంటే సగటున రోజుకు రూ.100 కోట్ల మేర స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నగదు రూ.395.39 కోట్లు కాగా, బంగారం, వెండి వంటి విలువైన లోహాల రూపంలో రూ.562.10 కోట్లు జప్తు చేసినట్లు ఈసీ తెలిపింది. అలాగే రూ.489.31 కోట్ల విలువ చేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం పట్టుపడినట్లు పేర్కొంది. సమగ్ర ప్రణాళిక ద్వారా వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. ఈ ఏడాది మొత్తం రికవరీలో సింహభాగం మాదకద్రవ్యాలదే కావడం గమనార్హం. రూ.4,650 కోట్ల రికవరీలో 45 శాతం మేర మాదక ద్రవ్యాలే ఉన్నట్లు ఈసీ తెలిపింది. మొత్తంగా రూ.2,068.85 కోట్ల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. 2019 ఎన్నికల సమయంలో రూ.1,279.9 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇక టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బహుమతుల రూపంలో రూ.1,142.49 కోట్ల మేర స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వివరించింది. 75 ఏళ్ల లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఇదే అత్యధిక మొత్తం అని వెల్లడించింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ.3,475 కోట్లకు పైగా పట్టుబడింది. దానితో పోలిస్తే ఇది 34 శాతం అధికమని తెలిపింది. సమగ్ర ప్రణాళిక, సంయుక్త కార్యాచరణ, దర్యాప్తు సంస్థలు, భద్రతా బలగాల మధ్య సమన్వయంతో పాటు పౌరుల సహకారంతోనే ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకోగలుగుతున్నామని ఈసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇక దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వివిధ రూపాల్లో ఈసీ స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.4,658 కోట్లలో రాజస్తాన్ తొలి స్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రంలో మార్చి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకూ మొత్తం రూ. 778.52 కోట్లు స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత రూ.605 కోట్లతో గుజరాత్ తర్వాతి స్థానంలో నిలిచింది. ఇక తమిళనాడులో రూ.460.8 కోట్లు, మహారాష్ట్రలో రూ.431.3 కోట్లు, పంజాబ్‌లో రూ.311.8 కోట్లు పట్టుబడింది. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ నుంచి రూ.121.84 కోట్ల మేర స్వాధీనం చేసుకోగా, ఆంధ్ర ప్రదేశ్ నుంచి రూ.125.97 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల అక్రమాలు, అవకతవకల్లో అత్యల్పంగా లఢఖ్, లక్షద్వీప్ ప్రాంతాలు నిలిచాయి. తమిళనాడులోని నీలగిరిలో ఇటీవల జరిగిన ఒక సంఘటనలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్‌ను సస్పెండ్ చేయడం ద్వారా విధి నిర్వహణలో అలసత్వంపై కమిషన్ చర్యలు తీసుకుంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, ప్రచారంలో రాజకీయ నాయకులకు సహాయం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఈసీఐ ప్రకారం కఠిన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల అధికారిక ప్రకటనకు ముందు నెలల జనవరి, ఫిబ్రవరిలో, నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాలు, ఉచిత తాయిలాల రూపంలో దేశవ్యాప్తంగా మరో రూ.7,502 కోట్ల జప్తు నమోదయింది. 'ఇది ఎన్నికల కాలానికి ఇంకా ఆరు వారాలు మిగిలి ఉండగానే ఇప్పటివరకు మొత్తం జప్తు 12,000 కోట్ల రూపాయలకు చేరుకుంది' అని పేర్కొంది.

మాదకద్రవ్యాల ముప్పుపై ప్రత్యేక దృష్టి

కేంద్ర ఎన్నికల సంఘం మాదకద్రవ్యాల ముప్పుపై కూడా దృష్టి సారించింది. మాదకద్రవ్యాల స్వాధీనంపై గణనీయమైన దృష్టి ఉందని పేర్కొంది. ఇది జనవరి, ఫిబ్రవరిలో జరిగిన మొత్తం స్వాధీనంలో దాదాపు 75 శాతం వాటాను కలిగి ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తన నోడల్ సంస్థలను సందర్శించిన సందర్భంగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంలో ఆ సంస్థల ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికి అక్రమ డబ్బును ఉపయోగించే ప్రమాదంతో పాటు మాదకద్రవ్యాలు సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్రమైన హాని కలిగిస్తాయని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరగనున్న విషయం తెలిసిందే. తొలి విడత ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 26న రెండో విడత, మే 7న మూడో విడత, మే 13న నాలుగో విడత, మే 20న ఐదో విడత, మే 25న ఆరో విడత, జూన్ 1న ఏడో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఇక తొలి విడతలోనే ఇంత మొత్తంలో నగదు రికవరీ కావడం గమనార్హం. ఎన్నికలు ముగిసే సరికి ఇంకా పెద్ద మొత్తంలో నగదు పట్టుబడే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు ఈ అంశం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

నిఘా నీడలో బస్సు యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలకు బాధ్యతలు కేటాయించారు. సీఎం వెళ్లే మార్గంలో నిఘా నేత్రం ఎప్పుడూ ఉంటుంది. అధికారులు నిశితంగా పరిశీలిస్తూ ముందుకు పోతారు. బస్సు యాత్రలో భాగంగా యథాతథంగా రోడ్ షోలు, బహిరంగ సభలకు జగన్ హాజరవుతారు. నిర్దేశించిన మార్గంలోనే రోడ్ షోలు, ముఖాముఖీలు, బహిరంగ సభలు పూర్తి భద్రత, ఆంక్షల నడుమ ఉంటాయి. క్రేన్లతో భారీ గజమాలలు, పూలలు చల్లడంపై అధికారులు ఆంక్షలు విధించారు. బస్సుకు రెండు వైపులా రోప్‌ను ఏర్పాటు చేసి, ప్రజలు ముందుకు దూసుకురాకుండా చర్యలు నిర్వహించారు. బస్సు ముందు భాగం, వెనుక భాగంలో పోలీసు బృందాలు ప్రత్యేక నిఘాతో జగన్ యాత్రను అనుసరిస్తాయి. కాగా, ఈనెల 24న శ్రీకాకుళం జిల్లాలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర పూర్తవుతుంది.

జగన్‌కు నేతల పరామర్శ

సీఎం జగన్‌పై జరిగిన దాడి ఘటన అనంతరం కేసరపల్లి క్యాంపు దగ్గర వివిధ ప్రాంతాలకు చెందిన వైసీపీ ముఖ్య నేతలు, మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఇలాంటి దాడులు మనల్ని ఆపలేవని, ప్రజల ఆశీర్వాదంతోనే దాడి నుంచి తప్పించుకున్నానని సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. కేసరపల్లి రాత్రి విరామ పాయింట్ వద్ద ఆయనను కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో సహా అనేక మంది సీనియర్ నేతలు కలిశారు. సీఎం నుదుటి గాయంపై పార్టీ నేతలు వాకబు చేశారు. ఈ సందర్భంగా సీఎం వారితో మాట్లాడుతూ ఇలాంటి దాడులు నన్ను ఆపలేవని, మనకు దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం ఉన్నాయని చెప్పారు. ధైర్యంగా అడుగులు ముందుకేద్దామని, ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని దిశానిర్దేశం చేశారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో పాటు రాష్ట్రం నలుమూల నుంచి నాయకులు తరలివచ్చారు. సీఎం జగన్‌ను శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు, మంత్రులు జోగి రమేశ్, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రజావ్యవహారాల సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎంపీ ఆయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్, ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, గన్నవరం ఎమ్మెల్యే వంశీ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాశ్, మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు తదితరులు కలిశారు.

మోదీ సమర్థన

(మొదటిపేజీ తరువాయి)

విషయం. నిజాయితీగా వాళ్లు ఆలోచించినప్పుడు ప్రతి ఒక్కరూ పశ్చాత్తాప పడతారు' అని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల బాండ్లు లేకపోతే డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో? ఎవరు? ఎలా ఇచ్చారు? అనే విషయాలు తెలుసుకునే అధికారం ఉండేది కాదన్నారు. ఇది ఎన్నికల బాండ్ల విజయ గాథ అని చెప్పారు. బీజేపీకి 37% శాతం నిధులు ఎన్నికల బాండ్ల ద్వారా వస్తే ప్రతిపక్షానికి 63% శాతం వచ్చాయని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఈ పథకాన్ని గత ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి విదితమే. సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును విపక్ష పార్టీలు, పౌర సమాజం కార్యకర్తలు స్వాగతించారు. ఈ పథకం కింద అత్యధికంగా నిధులు అందుకున్న పార్టీలో బీజేపీ మొదటి స్థానంలో ఉందని విశ్లేషణలు వెలువడ్డాయి. ఈ పథకం ద్వారా బీజేపీ అవినీతికి పాల్పడి అత్యధిక విరాళాలు అందుకుందని విపక్ష 'ఇండియా' కూటమి నిప్పులు చెరిగింది. అయితే కేంద్రం పారదర్శకంగానే స్కీమ్ ప్రవేశపెట్టిందని, తమ కంటే విపక్ష కూటమికి వచ్చిన విరాళాలే ఎక్కువని బీజేపీ చెబుతోంది. ఇంటర్వ్యూలో 2047 వరకు దేశ భవిష్యత్‌పై తన ప్రణాళికలపై కూడా మోదీ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే... మోదీ సర్కారు రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తారని ప్రతిపక్షాలు ప్రయత్నించడం అవాస్తవమన్నారు. దేశ సంపూర్ణ అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామని వ్యాఖ్యానించారు. 'కొన్ని ప్రభుత్వాలు తాము ప్రతీది చేశామని చెప్పుకుంటాయి. కానీ నేను అన్నీ చేశానని చెప్పను. దేశ అవసరాలు చాలా ఉన్నాయి. కాబట్టి, చేయాల్సినవి చాలా ఉన్నాయని మోదీ తెలిపారు.

బీజేపీ పతనం ఖాయం

- ఇండియా కూటమికి పెరుగుతున్న మద్దతు
- రామచంద్రయ్య గెలుపు నియోజకవర్గ అభివృద్ధికి మలుపు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-పత్తికొండ: రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలోని చదువుల రామయ్య భవనంలో సీపీఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు నబీ రసూల్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో ముప్పాళ్ల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రధాని మోదీ గంభీర ప్రకటనలలో నీతి లేదన్నారు. మోదీది డొల్ల అభివృద్ధి అని, ఆయన పాలనలో సామాన్య ప్రజలకు కష్టాలు పెరిగిపోయాయన్నారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్షాలు, గొంతుకలను బెదిరిస్తున్నారని విమర్శించారు. ఆర్థిక నేరాల పేరుతో ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపడం...నిజమైన ఆర్థిక నేరగాళ్లు బీజేపీలో ఉంటే మంచివారుగా భావిస్తున్నారని మండిపడ్డారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేరం చేయకపోయినా మద్యం కుంభకోణం పేరుతో తీహార్ జైలుకి పంపారని చెప్పారు. 2024 ఎన్నికలలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మోదీ రాజ్యాంగం అమలవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇండియా కూటమికి రోజురోజుకి ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేపట్టే రైతు నాయకుడు పి.రామచంద్రయ్యను పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గంలో గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. రామచంద్రయ్య గెలుపు పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధికి మలుపు అని ఆయన అన్నారు. సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం నిత్యం కరువు కాటకాలకు నిలయమని, ఈ ప్రాంత అభివృద్ధికి, పంటపొలాలకు సాగునీరు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆవుల శేఖర్, లెనిన్‌బాబు మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, కమ్యూనిస్టులను చట్టసభలకు పంపాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మునెప్ప, ఎస్ఎన్ రసూల్, జిల్లా మాజీ కార్యదర్శి పి.భీమలింగప్ప, జిల్లా నాయకులు జగన్నాథం, డి.రాజా సాహెబ్, రామకృష్ణారెడ్డి, మద్దిలేటి శెట్టి, చంద్రశేఖర్, రంగన్న, పంపన్న గౌడ్, కారుమంచి, అజయ్‌బాబు, భాస్కర్ యాదవ్, విరూపాక్షి, కృష్ణ, తుగ్గలి, మద్దికేర, వెల్దుర్తి, కృష్ణగిరి మండల కార్యదర్శులు సుల్తాన్, నాగరాజు, కృష్ణ, ఖలీల్, నాయకులు దూదే కొండ, పెద్ద ఈరన్న, రవి మోహన్, వెంకటరాముడు, నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోదీ అబద్ధాల కోరు

పదేళ్లలో ఉద్యోగాల కల్పనలో వైఫల్యం
వ్యవసాయ రంగం నిర్వీర్యం: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: ప్రధాని నరేంద్ర మోదీ పచ్చి అబద్ధాలకోరని, పదేళ్ల పాలనలో యువతకు ఉద్యోగాల కల్పనలో వైఫల్యం చెందారని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ధ్వజమెత్తారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎత్తురోడ్ బండివారిపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు అధ్యక్షత సీపీఐ జిల్లా కౌన్సెల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకర్ మోదీ ప్రభుత్వ విధానాలపై నిప్పులు చెరిగారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి యువతను ఆదుకుంటామని చెప్పిన మోదీ పదేళ్లలో ఒక్క ఉద్యోగం భర్తీ చేయకపోగా... ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి యువతను దారుణంగా మోసగించారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని చావుదెబ్బ కొట్టారన్నారు. దేశంలో ప్రతి 45 నిమిషాలకు ఓ రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్... తన ప్రభుత్వం వల్ల మంచి జరిగితేనే ఓటు వేయమని అడుగుతున్నారని, మోదీ ప్రభుత్వం వల్ల రైతాంగ వినాశనం జరిగిందని, ఏ మొహం పెట్టుకొని మోదీ ఓటు అడుగుతారని ప్రభాకర్ ప్రశ్నించారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తానని చెప్పి దానికి భిన్నంగా నాలుగు నల్లచట్టాలు తెచ్చారని దుయ్యబట్టారు. పరిశ్రమలు అన్నీ కార్పొరేటర్లకు ధారాదత్తం చేసి 60 లక్షల కోట్లు టర్నోవర్ సాధించి భవిష్యత్‌లో అమ్మడానికి ఏమిమిగలక చేతులు ముడుచుకుని కూర్చుంటారే మోనని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని కాపాడు కునేందుకు 750 మంది ప్రాణత్యాగం చేశాంన్నారు. పెట్రోల్ గ్యాస్, డీజిల్, నిత్యావసరాలు విపరీతంగా పెంచి సామాన్యుడు బతకలేని పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. స్విస్ బ్యాంక్‌లో నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాల్లో వేస్తానని నమ్మించి మోసం చేశారని అన్నారు. హిందూ ఓటర్లను ఓటు బ్యాంకుగా చేసుకుని బీజేపీ రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, చెలికాని స్టాలిన్, మోకా శ్రీనివాసరావు, ఆనంద్, శీలం వెంకటేశ్ పాల్గొన్నారు.

23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు: ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల 23వతేదీతో ముగుస్తుందని, వార్షిక పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అదే రోజు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గతేడాది మాదిరిగానే ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను తల్లిదండ్రులకు అందించ డంతోపాటు, విద్యార్థుల ప్రగతిని వివరిస్తా మన్నారు. తల్లిదండ్రుల హాజరు 100 శాతం ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉంటుందన్న విషయాన్ని చిన్నారుల తల్లిదండ్రులకు 22న గుర్తు చేయా ల్సిన బాధ్యత తరగతి టీచర్లదేనని ఆయన స్పష్టం చేశారు. రెండు తరగతుల సైన్స్, సోషల్ సైన్స్ పుస్తకాలు వేసవి సెలవుల్లో చది వేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఆయా సబ్జెక్టులు గతంలో చదివినా... ప్రస్తుతం అవే సబ్జెక్టులు మళ్లీ చదవడం ద్వారా సంబం ధిత అంశాలను మరింతగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిసే సమయంలో విద్యార్థులను తమ పుస్తకాలను తిరిగి పాఠశాలల్లో అప్పజెప్పాలన్న విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. పాఠశాలల్లో లైబ్రరీ ఏర్పాటు పేరుతో పుస్తకాలను వెనక్కి తీసుకోకూడదన్న సందేశాన్ని హెచ్ఎంలకు, టీచర్లకు చేర వేయాలని డీఈవోలను ఆదేశించారు.

ఇండియా కూటమిని గెలిపించుకుందాం

అవకాశవాద పార్టీలకు బుద్ధి చెబుదాం
తిరుపతి ఎన్నికల ప్రచారంలో హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని... వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ అవకాశవాద రాజకీయాలకు బుద్ధి చెబుదామని కూటమి నేతలు పిలుపునిచ్చారు. 'ఇండియా' కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి.మురళి, కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ చింతామోహన్‌ను గెలిపించాలని కోరుతూ తిరుపతి నగరం జీవకోనలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని, అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి తాడేపల్లె ప్యాలెస్‌ను కేంద్రంగా చేసుకుని నియంతృత్వ పోకడలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యేలకుగానీ, ప్రజలకుగానీ ఆయన అవకాశం లేకుండా చేశారన్నారు. నేడు ఎన్నికల కోసం జగన్ ప్రజల్లోకి వచ్చినా... 20 అడుగుల ఎత్తు గల బస్సులో నిలబడి ఎవరికీ కనబడకుండా వెళుతున్నారన్నారు. ఇపుడు కూడా ప్రజలు తమ సమస్యలు చెప్పుకోలేని పరిస్థితి జగన్ కల్పించాడన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా ఈ ఐదేళ్లలో ప్రజల కోసం కనీసం ఒక్క పోరాటం కూడా చేయలేదని తెలిపారు. అసెంబ్లీలో కూడా ప్రజల సమస్యల గురించి చర్చించక పోవడం దారుణమన్నారు. ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ బీజేపీతో అవకాశవాద పొత్తు ఏర్పాటు చేసుకుని ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. బీజేపీ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు అమలు చేయలేదని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు విడుదల చేయలేదన్నారు. రాజధాని నిర్మాణానికి సహకరించక పోగా... జగన్‌మోహన్ రెడ్డికి సహకరిస్తూ మూడు రాజధానుల పేరుతో డ్రామాకు తెరదీశారన్నారు. ఏపీని అన్ని రకాలుగా భ్రష్టుపట్టించిన బీజేపీతో టీడీపీ, జనసేన అవకాశవాద పొత్తు పెట్టుకుని ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. దేశాన్ని భ్రష్టు పట్టించిన బీజేపీని, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్‌ను ఓడించి... 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని హరినాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళిని నిలబెట్టా మన్నారు. మురళి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ 'ఇండియా' కూటమి ప్రజలందరినీ చైతన్యం చేసి రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తోందన్నారు. తిరుపతిలో ఇండియా కూటమి అభ్యర్థి మురళిని గెలిపిస్తే శ్రామిక వర్గాలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాగంటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అధికార బీజేపీ, వైసీపీ పూర్తిగా దేశం, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయన్నారు. తిరుపతిలో కూటమి అసెంబ్లీ అభ్యర్థి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళిని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్‌కు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నీరుగట్టి నగేష్ మాట్లాడుతూ తిరుపతి ప్రజలందరూ ఆలోచించి ఇండియా కూటమి అభ్యర్థి మురళిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జనార్దన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు ఎన్.డి.రవి, ఎం.శివ, కె.వై.రాజా, పద్మనాభ రెడ్డి, రామకృష్ణ, మంజుల, రత్నమ్మ, బండి చలపతి, ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, ఆర్.లక్ష్మి, వేణు, బుజ్జి, మాధవ్, సుజాతమ్మ, సీపీఐ నాయకులు రామ్మూర్తి, మునీశ్వర్ రెడ్డి, లక్ష్మి, హరిత, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో 'సహకారం'

కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లది 120 ఏళ్ల ఘన చరిత్ర: చలసాని

విశాలాంధ్ర-భీమవరం టౌన్: సామాన్యులకు అందుబాటులో ఉండాలన్నదే సహకార బ్యాంక్‌ల ముఖ్య ఉద్దేశ్యమని, ఆ మేరకు పలు పట్టణాల్లో బ్రాంచ్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 120 సంవత్సరాలు ఘనచరిత్ర కలిగి ఉందని పేర్కొన్నారు. 2023 నాటికి 15,002 బ్రాంచ్‌లు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. రూ.ఐదు లక్షల 33 వేల కోట్లు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించినట్టు చెప్పారు. రూ.మూడు లక్షల 30వేల కోట్లమేర రుణాలు మంజూరు చేసినట్టు వివరించారు. ప్రపంచంలో వాణిజ్య బ్యాంకులు సామాన్యుడికి అందుబాటులో లేని పరిస్థితుల్లో, సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా కో-ఆపరేటివ్ బ్యాంకులను తీర్చిదిద్దినట్టు చెప్పారు. ప్రభుత్వ, రిజర్వ్ బ్యాంక్ సహకారం లేకుండా సక్రమంగా నడుస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 15 కో-ఆపరేటివ్ బ్యాంకులు కష్టకాలంలో ఉన్నప్పటికీ, డిపాజిట్ దారులు, షేర్ హోల్డర్లు నష్టపోకుండా వాణి అర్బన్ బ్యాంక్ ద్వారా లావాదేవులు జరపడం జరుగుతుందన్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం, నర్సాపురంలలో కో-ఆపరేటివ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చెన్నబసవస్వామి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కే కాలప్ప, విశాఖపట్నం మహారాజ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌కే రాజు, ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ అంబిక ప్రసాద్, గుత్తి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ షేక్ అబ్దుల్ జిలానీ, వీఎస్‌కే కళాశాల సెక్రటరీ వబిలిశెట్టి పట్టాభిరామయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'విజయవాడ పశ్చిమం' గెలవాలి

సీపీఐ శ్రేణులకు జల్లి విల్సన్ దిశానిర్దేశం
19న కోటేశ్వరరావు నామినేషన్

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఎన్నికల ఎత్తుగడలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పని చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వల్లంకొండ రామబ్రహ్మం అధ్యక్షతన సోమవారం స్థానిక దాసరి భవన్‌లో జరిగిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ ముఖ్యనాయకులకు దిశానిర్దేశం చేశారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ... డబ్బు రాజకీయాలు చేసే టీడీపీ, వైసీపీలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. వామపక్ష, ప్రజా తంత్ర శక్తులు ఐక్యం కావాల్సి ఉందన్నారు. 1952 నుంచి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ పాల్గొం టూనే ఉందని, ఈ సారి ఎన్నికలకు ప్రత్యేకత ఉందన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తా మని బహిరంగంగా మోదీ ప్రకటిస్తున్నారని చెప్పారు. మనుధర్మ శాస్త్ర మూలాలు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే లౌకిక రాజ్యాంగానికి విఘాతం కలుగుతుందని ఎస్సీ, ఎస్టీలు భయపడుతున్నారని చెప్పారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడి భారత రాజ్యాంగాన్ని రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి జీ కోటేశ్వరరావు గెలుపుకోసం ఎన్టీఆర్ జిల్లా నాయకత్వం గట్టిగా కృషి చేయాలని సూచించారు. కోటేశ్వరరావు 30ఏళ్లు పూర్తి సమయం కార్యకర్తగా పార్టీ కోసం పని చేశారని, శక్తి యుక్తులు ఒడ్డి ఈ సీటు గెలుచుకోవాల్సి ఉందన్నారు. మైనార్టీలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు పశ్చిమ నియోజకవర్గంలో ఉండే బంధు మిత్రులను కలిసి మద్దతు కూడగట్టాలని సూచించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పీడిత ప్రజల వాణిని లోక్‌సభ, అసెంబ్లీలో వినిపించటానికి సీపీఐ ప్రయత్నిస్తుం దన్నారు. ఎన్డీఏ వల్ల కలిగే ముప్పు, చంద్రబాబు అవకాశవాద రాజకీయాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజా సమస్యలపై వైసీపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష టీడీపీ కంటే సీపీఐ ఎక్కువగా పోరాడిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ నెల 19వ తేదిన పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జీ కోటేశ్వరరావు నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగే భారీ ప్రదర్శనలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల ప్రచారంలో సీపీఐ నాయకులు పాల్గొనాలని కోరారు. జిల్లా సమితి సమావేశం సందర్భంగా ప్రజానాట్య మండలి నుంచి రంగారావు, శర్మ, మహిళా సమాఖ్య నుంచి బంకా ఝాన్సీలక్ష్మీ, యువజన సమాఖ్య నుంచి ఎస్‌కే సుభానీలను జిల్లా కౌన్సిల్‌లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ తాను పోటీ చేస్తున్న నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతికంగా బీజేపీతో తలపడటం సంతోషంగా ఉందన్నారు. సీపీఐకి సానుకూల వాతావరణం ఉందన్నారు. బీజేపీ అనుసరించిన విధానాల వల్ల మైనార్టీలు, వ్యాపార వర్గాలు ఇండియా కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, సీనియర్ నాయకులు తూము కృష్ణ, చుండూరు వెంకట సుబ్బారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా ప్రజానాట్య మండలి విజయవాడ నగర కార్యదర్శి శర్మ విప్లవ గీతాలు ఆలపించారు.

ఇండియా కూటమి గన్నవరం అభ్యర్థి 'చల్లం'ను గెలిపించుకుందాం

సీపీఐ కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశంలో కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-మచిలీపట్నం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న మతోన్మాదాన్ని తిప్పికొట్టేలా ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా బందరు పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షతన సీపీఐ కృష్ణాజిల్లా కౌన్సిల్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కేవీవీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశం ఒక మతరాజ్యంగా ఉండాలని, లౌకిక వ్యవస్థను కాలరాయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. లౌకిక వ్యవస్థను కాపాడుకోవడానికి ఇండియా కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చాలన్నారు. సీపీఎం గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి చల్లం వెంకటేశ్వరరావును గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థిని గెలిపించడానికి పలు తీర్మానాలు చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటామని, నిత్యావసరాల ధరలు పెరగకుండా అన్ని రాజకీయ పార్టీలు ప్రజల ముందు వాగ్దానాలు చేయాలని కోరారు. పేద ప్రజానీకానికి గుదిబండగా మారిన గ్యాస్ సిలిండర్ ధర రూ.500 తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాడిపర్తి తాతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, సీపీఐ ఏపీ కంట్రోల్ కమిషన్ సభ్యుడు మోదుమూడి రామారావు, పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, పెడన నియోజకవర్గ కార్యదర్శి పి.ఉమాకాంతం, పామర్రు నియోజకవర్గ కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసరావు, గుడివాడ నియోజవర్గ కార్యదర్శి జి. ప్రకాశ్, రైతు సంఘం కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు హనుమోలు సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

తిరోగమనంలో ప్రభుత్వ విధానాలు

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేవారినే ఎన్నుకోండి: పీవీ రమేశ్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలు అభివృద్ధి వైపు కాకుండా తిరోగమన వైపు పయనిస్తున్నాయని ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి.వి.రమేశ్ కుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపే వారినే ఎన్నుకోవాలని సూచించారు. స్థానిక పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి'అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వల్లరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత సోమవారం చర్చా గోష్ఠి జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమేశ్ కుమార్ మాట్లాడుతూ యువతరం దేశ, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలని, తమ భవిష్యత్తుపై ఆసక్తి పెంచుకోవాలని పేర్కొన్నారు. అప్పులతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని, దాని ద్వారా తీవ్రమైన సంక్షోభాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. నేడు మన రాష్ట్రంలో బటన్ నొక్కి ప్రజల అకౌంట్లోకి డబ్బులు పంపటం ద్వారా రాష్ట్రం ఆర్థికంగా నష్టపోతుందని వివరించారు. విద్య, వైద్య ప్రమాణాలు పెంచాలని ఉత్పాదకశక్తులను ప్రోత్సహించడం, సంపదని సృష్టించడం ద్వారా అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని అన్నారు. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి పైసాకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కొండవీటి చిన్నయసూరి ప్రసంగిస్తూ పౌరులను లబ్ధిదారులుగా మార్చి ఓటర్లుగా ఉపయోగించుకోవటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. సమిష్టి ప్రయోజనాలకు తిలోదకాలిచ్చి, రవాణా, విద్య, వైద్యం బాధ్యతల నుంచి ప్రభుత్వం వైదొలగడం సముచితం కాదన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర బడ్జెట్లో కేవలం 2.5 శాతం మాత్రమే గత ఐదు సంవత్సరాలుగా నీటిపారుదల ప్రాజెక్టులపై వ్యయం చేశారన్నారు. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ 30వ స్థానంలో ఉందన్నారు. హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజ ప్రసంగిస్తూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారంగా 2017లో లక్ష 48 వేల నేరాలు నమోదైతే 2022లో దాదాపు రెండు లక్షల నేరాలు నమోదయ్యాయన్నారు. విజయవాడ నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, అఖిలభారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేశ్ ప్రసంగించారు. తొలుత రంగం ప్రజా సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఆర్.రాజేశ్ బృందం చైతన్యవంతమైన గీతాలు ఆలపించింది.

బాధ్యత వహించాల్సిన అధికారులతోనే విచారణా?

జగన్‌పై రాయి విసిరిన ఘటనపై జనసేన అధినేత పవన్ విస్మయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి మీద గులక రాయితో దాడి విషయంలో బాధ్యత వహించాల్సిన అధికారులతోనే విచారణ చేయించడంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విస్మయం వ్యక్తం చేశారు. వీవీఐపీ కేటగిరీలో ఉన్నారనే కదా సదరు పాలకుడు ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్ళినా పరదాలు కట్టి... చెట్లు కొట్టేసేవారు. అన్నీ పట్టపగలే నిర్వహించారు కదా. మరి ఏ ఉద్దేశంతో విజయవాడ నగరంలో విద్యుత్ కూడా నిలిపివేసి చీకట్లో యాత్ర చేయించారు? పరదాలూ కట్టలేదు... చెట్లూ కొట్టలేదు... అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ దాడి విషయంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి బాస్ అయిన డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, విజయవాడ పోలీస్ కమిషనర్, ముఖ్యమంత్రి సెక్యూరిటీ అధికారుల పాత్ర గురించి విచారణ చేయించాలి. వాళ్లు తీసుకున్న భద్రతా చర్యల్లో లోపాలు ఏమిటి? ఇంటెలిజెన్స్ వైఫల్యం ఏమిటనేది తేలాలి. ముందుగా సదరు అధికారులను బదిలీ చేసి, సచ్ఛీలత కలిగిన అధికారులకు విచారణ బాధ్యత అప్పగిస్తేనే గులక రాయి విసిరిన చేయి... ఆ చేయి వెనక ఉన్నదెవరో బయటపడుతుంది. సూత్రధారులు, పాత్రధారులెవరో తేలుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటించి ఎన్నికల సభలో పాల్గొన్నప్పుడే భద్రతాపరమైన లోపాలు వెల్లడయిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఇలాంటి అధికారులు ఉంటే... ప్రధాన మంత్రి మరోసారి పర్యటించి నప్పుడూ ఇంతే నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. వీళ్లతో ఎన్నికలు ఎలా పారదర్శకంగా నిర్వహించగలరు? ఈ విషయంపై కేంద్ర ఎన్నికల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టిపెట్టాలని కోరుతూ పవన్ ట్వీట్ చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎన్‌డీఏ వైఖరి స్పష్టం చేయాలి

మేము స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం
మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎన్‌డీఏ నాయకులు తమ వైఖరిని స్పష్టంగా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం విశాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం గాజువాకలో సభ నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు స్టీల్ ప్లాంట్‌పై ఒక్క మాట మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీగా, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్‌డీఏ బలపరిచిన వారే పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. తామైతే వైసీపీ తరపున మొదటి నుంచి ఒకే మాట చెబుతున్నామని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో రేపు గెలిచిన వెంటనే ఎటువంటి పోరాటానికి అయినా సిద్ధమని, పార్లమెంటులో అయినా, బయట అయినా తాము పోరాడతామన్నారు. స్టీల్ ప్లాంట్‌పై బీజేపీతో లాలూచి పడింది టీడీపీనే అన్నారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని చెప్పిన సెలబ్రిటీ పార్టీ కూడా వారితో కలిసిపోయిందన్నారు. స్టీల్ ప్లాంట్ కోసం రాజీనామా చేసిన గంటా శ్రీనివాస్ మళ్లీ తన రాజీనామాను ఆమోదించవద్దంటూ కోర్టుకు వెళ్లారని అన్నారు. జగన్‌ను లక్ష్యంగా చేసుకుని షూటర్‌ను పెట్టి దాడి చేసినట్లుగా ఉందని, దాడి ఎవరిపై చేసినా ప్రజాస్వామ్యంలో అది సరికాదన్నారు. పవన్ వంటి సెలబ్రిటీలకే డ్రామాలు ఆడటం తెలుసునని, జగన్ యాక్టర్ కాదని, రియల్ హీరో అని అభివర్ణించారు. ఇలాంటి దాడులు ఇక్కడితో ఆగాలన్నారు. పవన్ కళ్యాణ్‌కు వ్యవస్థల గురించి ఏమి తెలుసంటూ ప్రశ్నించారు. ప్రజలు విశేషంగా ఆదరించిన సంక్షేమ పథకాలను ఏ నాయకుడు టచ్ చేసే దమ్ము లేదని, ప్రజాపయోగ పథకాలను ఎవరు అధికారంలో ఉన్నా రద్దు చేయలేరన్నారు. నాడు ఎన్టీఆర్ కిలో రెండు రూపాయల బియ్యం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ దీనికి ఉదాహరణ అన్నారు. ఆదరణ లేని పథకాలు రద్దు చేస్తే ప్రజలు స్వాగతిస్తారని, అన్న క్యాంటీన్లు ఉదహరిస్తూ చెప్పారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా తీసుకు వచ్చిన ఒక్క సంక్షేమ పథకం పేరు చెప్పాలని సవాలు విసిరారు.

సంపాదకీయం

ఎన్నికల బాండ్లపై మోదీ నోటి వాటం

ఎన్నికల బాండ్లు చెల్లవని, అవి రాజ్యాంగ విరుద్ధమైనవని అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచి గత ఫిబ్రవరి 15న అనుమానాలకు తావు లేకుండా తీర్పు చెప్పినా ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఆ తీర్పును పరోక్షంగా తప్పు పడుతూనే ఉన్నారు. ఎన్నికల బాండ్ల పథకమే లేకపోతే ఎన్నికల వ్యవస్థలో నల్ల ధనం ఏరులై పారుతుందని కడవల కొద్దీ కన్నీళ్లు కూడా కారుస్తున్నారు. ఇది కచ్చితంగా సుప్రీంకోర్టు అంతిమ నిర్ణయాన్ని సవాలు చేయడమే. ఆ తీర్పును పాటించాలన్న ఉద్దేశం బీజేపీకి ఏ కోశానా ఉన్నట్టు లేదు. వచ్చే ఎన్నికలలో బీజేపీకి మూడోసారి అధికారం దక్కితే ఎన్నికల బాండ్ల పథకాన్ని మరో రూపంలో తీసుకొచ్చినా ఆశ్చర్య పడనక్కర్లేదు. ప్రధానమంత్రి మోదీతో అంతగా సఖ్యత లేదనుకుంటున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబోలె సుప్రీంకోర్టు తీర్పు తరవాత కూడా రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల పథకాన్ని గట్టిగా సమర్థిస్తూనే ఉన్నారు. ఏ ముఖ్యమైన అంశం మీదా నోరు విప్పే అలవాటు లేని ప్రధానమంత్రి కూడా అన్యాపదేశంగా సుప్రీంకోర్టును తప్పు పట్టారు. బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడంలో ఎన్నికల వ్యవస్థలో నల్లడబ్బు పాత్ర లేకుండా చేయడమేనని ఇల్లెక్కి అరిచి మరీ చెప్పారు. అధికారంలో ఉన్న గత పదేళ్లుగా ఎన్నడూ మీడియా ముందుకు రాని ప్రధానమంత్రి అప్పుడప్పుడూ తనకు ఇష్టమైన, లేదా తనను ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగరు అని నమ్మకం ఉన్న పత్రికలకో, మీడియా సంస్థల ప్రతినిధులకో ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు ఇస్తుంటారు. "రాజ్యాంగ విరుద్ధమైన" ఎన్నికల బాండ్ల పథకాన్నీ సమర్థించడానికి మళ్లీ మోదీ అదే మార్గం ఎన్నుకున్నారు. ప్రభుత్వానుకూలమైన ఎ.ఎన్.ఐ. వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ బాండ్లను గట్టిగా సమర్థించారు. నల్ల ధనాన్ని అదుపు చేయడమే ఈ బాండ్ల ఉద్దేశమని గట్టిగా వాదించారు. నల్ల ధనాన్ని అదుపు చేయడానికి ఎన్నికల బాండ్లే శరణ్యమని తాము ఎప్పుడూ చెప్పలేదని, ఏ పథకంలోనైనా లోపాలు ఉండొచ్చునని, వాటిని సరిదిద్దుకోవచ్చునని ఎ.ఎన్.ఐ.కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ తెలియజేశారు. నిజాయితీగా ఆలోచిస్తే ఈ పథకాన్ని వ్యతిరేకించడం పొరపాటని అందరూ గ్రహిస్తారని కూడా ఆయన అన్నారు. ప్రతిపక్షాలు ఈ విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని కూడా చెప్పారు. ప్రతిపక్షాలను విమర్శించడం మోదీకి సర్వ సాధారణమైన అంశమే కానీ ఈ విమర్శల అసలు లక్ష్యం ప్రతిపక్షాలు కాదని ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పిన సుప్రీంకోర్టును దృష్టిలో ఉంచుకునే ఈ వ్యాఖ్యలు చేశారని అర్థం అవుతూనే ఉంది. ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు సమకూరిన మొత్తంలో జ్యేష్ఠ భాగం అంటే 85 శాతం పైగా బీజేపీ ఖాతాలోకే వెళ్లిందని సుప్రీంకోర్టు తీర్పు తరవాత దఫ దఫాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.) వెల్లడించిన సమాచారం ద్వారా స్పష్టం అయింది. నష్టాల్లో మునిగిన కంపెనీలు, పేరుకు మాత్రమే అస్తిత్వంలో ఉన్న డొల్ల కంపెనీలు భారీగా బీజేపీకి ఎన్నికల బాండ్లు సమర్పించుకున్నాయన్న వాస్తవం బీజేపీకి నిద్ర పట్టకుండా చేసింది. తమ బండారం బయట పడ్డందుకు ఆ పార్టీకి దిమ్మ తిరిగినట్టయింది. వివిధ కంపెనీల మీద ముందు దర్యాప్తు సంస్థలు దాడిచేసిన తరవాత రాజకీయ పార్టీలకు విరాళాలు ముట్ట చెప్పాయన్న అంశాన్ని మోదీ చాలా చాకచక్యంగా వినియోగించుకుని ప్రతిపక్షాల మీద దాడికి దిగారు. ఇలా దాడికి గురైన 16 సంస్థలు ఇచ్చిన విరాళాల్లో 37 శాతం మాత్రమే బీజేపీకి అందాయని, మిగతా 63 శాతం ప్రతిపక్ష పార్టీల ఖజానాలోకి వెళ్లాయని మోదీ అంటున్నారు. ఈ మాట నిజమే అనుకున్నా మోదీ ప్రతిపక్ష పార్టీలు అంటున్నవి ఏదో ఒక రాష్ట్రంలో అధికారంలో ఉన్నవే. అంటే అసలు ఎన్నికల బాండ్ల పథకమే అధికారంలో ఉన్న పార్టీలు విరాళాలు దండుకోవడానికి అనువుగా రూపొందించదన్న వాస్తవాన్ని మోదీ వాటంగా కప్పిపుచ్చారు.

ఎన్నికల బాండ్ల పథకం నిజానికి సఫలమైందని, దీనివల్ల ఏ పార్టీకి ఏ కంపెనీ, లేదా ఎవరు ఎంతెంత విరాళం ఇచ్చారో తెలుసుకోవడానికి ఉపయోగపడిందని "రాజ్యాంగ విరుద్ధమైన" పథకాన్ని మోదీ సమ్మతించారు. అంటే సుప్రీంకోర్టు తీర్పును తప్పు పట్టినట్టే. "ఎన్నికలలో నల్లడబ్బు పాత్ర చాలా ప్రమాదకరమైందన్న చర్చ చాలా కాలంగా సాగుతోంది. ఎన్నికలలో అన్ని పార్టీలు, అభ్యర్థులూ డబ్బు ఖర్చు పెడ్తాయి. మా పార్టీ కూడా ఖర్చు పెడ్తుంది. ఖర్చు పెట్టాలంటే ఆ డబ్బు ప్రజల దగ్గర తీసుకోవలసిందే. ఎన్నికలలో నల్ల డబ్బు ప్రమేయం లేకుండా చేయడానికి నేను ఓ ప్రయత్నం చేసి ఎన్నికల బాండ్లు తీసుకొచ్చాను. ఈ చిన్న దారి కనిపించింది. ఇది పూర్తిగా లోప రహితమైన పద్ధతి నేను ఎన్నడూ చెప్పలేదు" అని మోదీ ఎ.ఎన్.ఐ.కి ఇచ్చిన ఇంటర్ వ్యూలో గొప్పగా చెప్పుకున్నారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు సమర్థించిన కొన్ని పక్షాలు ఇప్పుడు వ్యతిరేకిస్తున్నాయని మోదీ విమర్శలకు దిగారు. 2016లో రూ.1,000, రూ.2,000 విలువగల పెద్ద నోట్లను రద్దుచేసి నల్ల ధనాన్ని అదుపు చేసే ప్రయత్నం చేశామని గొప్పగా చెప్పుకున్నారు. ఎన్నికల సమయంలో ఈ పెద్ద నోట్లే ఎక్కువగా తరలించేవారని కూడా అన్నారు. రద్దుచేసినవాటిలో రూ.500 నోట్లున్నాయి. నల్ల డబ్బును అదుపు చయడానికే పెద్ద నోట్లను రద్దు చేశామని మోదీ చెప్పుకున్నారు. విచిత్రం ఏమిటంటే పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు అసలు రూ.2,000 నోట్లు లేనేలేవు. అవి ఆ తరవాతే చెలామణిలోకి వచ్చాయి. అంటే పెద్దనోట్లు రద్దు చేస్తున్నామని చెప్పి అంతకన్నా పెద్ద నోట్లను మోదీ చెలామణిలోకి తేవడంలోని తర్కం ఏమిటో లోతుగా ఆలోచిస్తే అర్థం అవుతుంది. పెద్ద నోట్ల రద్దుకు ముందు లేని 2000 రూపాయల నోట్లను ప్రస్తావించడం ఏమరుపాటుగా జరిగిన అంశం కాదు. అది మోదీ అబద్ధ ప్రచారంలో భాగం. దాదాపు చెలామణిలో ఉన్న నోట్లన్నీ రిజర్వు బ్యాంకుకు తిరిగి వచ్చాయి. ఇందులో తెల్లవేవి? నల్లవేవి? ఈ ప్రశ్నలకు గత ఏడేళ్లుగా సమాధానం లేదు. చెక్కు రూపంలో విరాళాలు స్వీకరించాలనుకున్నాం కానీ విరాళాలు ఇచ్చేవారు ఈ చెక్కులు ఎవరిచ్చారో తెలిసిపోతుంది కనక ఇతర పార్టీలు తమ మీద అక్కసు పెంచుకోవచ్చు కనక ఈ పద్ధతిని వ్యతిరేకించడంతో విరాళాలు ఎవరు ఎవరికి ఇచ్చారో తెలియని రీతిలో ఎన్నికల బాండ్ల విధానాన్ని రూపొందించామని మోదీ అడ్డంగా వాదిస్తున్నారు. అలాంటప్పుడు ఈ విధానం దాపరికం లేనిది ఎలా అయిందో? సుప్రీంకోర్టు జోక్యం లేకపోతే అది ఎన్నటికీ నిజం బయట పడేదే కాదు. తనకు అవసరమనుకున్నప్పుడు మోదీ ధారాళంగానే మాట్లాడతారు. అయితే అందులో అబద్ధాలే ఎక్కువ.

ఆపరేషన్ స్టోన్

చింతపట్ల సుదర్శన్

తప్పులనేవి అవి తప్పులనే సంగతి తెలీకుండానే జరిగి పోతుంటాయి. తప్పు జరిగాక, జరిగింది తప్పని తెలిశాక, ఎవరైతే మాత్రం ఏం చేయగల్రు తప్పు జరిగిపోయిందే అనుకోవం తప్ప.

కడుపునిండాక కూడా ఇంకో ముక్క అనుకోవడం కుక్క బుద్ధికాక మరోటికాదు కదా. ఇక చాలు వెళ్లిపోదామనుకుంటూనే తప్పు చేసింది డాగీ. ఒరేయ్ ఇక చాలురా, నిండిపోయేనురోయి అని ఏ కడుపూ అరచి చెప్పలేదు కదా! మరొక్కటే అనుకుంటూ షాపు ముందు నుంచున్న డాగీ మూతి ముందు ఎగిరొచ్చి ఏ ఎముకా పడలేదు కానీ నడివీపు చురుక్కుమంది. అది ఎండ చమక్కు చురుక్కూ కాదు. ఎవడో వెధవ అరచేతిలో పట్టినంత గులకరాయిని క్రికెట్టు ఆటలో ఫాస్ట్ బాల్ లాగ విసిరేశాడు. గురి తప్పని గులకరాయి ఫట్టుమని తాకింది వీపుని, అంతే అనవసరంగా తిన్నది చాలక ఆశగా కూచోవడం తప్పయిందని అప్పుడర్థమైంది డాగీకి. తన మీదకు ఆ గులకరాయి విసిరేసిన వాడెవడా అని వెనక్కి తిరిగి చూసింది వీలైతే వాడిపిక్క అంతుచూద్దామని నోరు తెరిచింది. రాయి విసిరినవాడు, వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తడం కనిపించింది. 'వీడికిదేం పోయే కాలం'

రంగస్థలం

నామానాన నాపని చేసుకుంటుంటే రాయి విసిరాడు. కొందరు ఆకతాయిలకు, తుంటరోళ్లకు అదేం బుద్ధో మరి కుక్క కండ్లపడితే చాలు, మీద పడి కరుస్తుందన్న భయంతో ఇలా రాళ్లు విసుర్తారు అని కనపడకుండా పోయిన వాడ్ని ప్రభుత్వాన్ని ప్రతిపక్షంవాడు తిట్టినట్టు తిట్టిపోస్తూ, కుయ్యోవ్ మొర్రోవ్ మంటూ ఇంటిదారి పట్టింది డాగీ. కళ్లముందు తన వీపు వాయగొట్టిన రాయే కనిపిస్తున్నది. రాయీ ఎంత పని చేశావే, నేన్నీకేం అపకారం చేశానే రాయీ, ఓ రాయీ, నా రాయీ, రాయీ అనుకుంటూ అరుగు ఎఅంతకుముందే అరుగుమీద ఉన్న డాంకీ ఏమిటి బ్రో భవ్వు భవ్వు మనాల్సిన వాడివి కుయ్యోవ్ మొర్రోవ్ అంటూ మూలుగుతున్నావు అనడిగింది. అంతా, నా గ్రహచారం ఈ ఇయర్ నా హారోస్కోప్ 'హారిబుల్'గా ఉన్నట్టుంది అంది డాగీ. హారోస్కోపులూ, టారట్ రీడింగులూ, న్యూమరాలజీలు, మనుషులకే కాని డాగీస్‌కు డాంకీలకు కూడానా! మనలీడర్లు పార్టీలు మార్చినట్టు కొంపలు మార్చుకుంటూ తిరిగే గ్రహాలు మనని పట్టించుకోవులే. పొరపాటున పట్టించుకున్నా యేమో. లేకపోతే నా మానాన నేను మరొక బోన్‌పీస్ కోసం పీస్‌ఫుల్‌గా వెయిట్ చేస్తుంటే ఓ టెర్రరిస్టు నా మీదకు కోడిగుడ్డంత గులకరాయి విసిరేశాడు. అర్జునుడు మత్స్య యంత్రాన్ని కొట్టినట్లు అది నా వీపుమీద ఫటేల్ మంది. నొప్పి ఇంకా సలుపుతూనే ఉంది అంది డాగీ.

అంత దెబ్బ కొడితే గౌతమ బుద్ధుడిలా చూస్తూ ఊరుకున్నావా? ఎందుకూరుకుంటాను నా పళ్ల మధ్య వాడి పిక్కను పట్టుకుందును కానీ వాడు చిక్కడు దొరకడులా పారిపోయేడు. వాడికీ నీకూ పాత గొడవేమన్నా ఉందేమో. ఇంతకుముందే వాడి మీద వాడు జడుసు కునేట్టు అరిచావేమో ఆ కసి తీరడానికి రాయి తీసుకుకొట్టాడేమో గుర్తు చేసుకో అంది డాంకీ. మొన్న ఓ పార్టీ వాళ్లు ఊరేగింపుగా వెళ్తుంటే రోడ్డు వార పడుకున్న నా తోకను తొక్కేస్తాడేమోనని ఒకడి మీద భవ్వుమన్నా వాడేనేమో అంది డాగీ గుర్తు చేసుకుంటూ. సరిపోయింది నువ్వు మరో పార్టీకి సపోర్టు చేస్తున్నావనుకుని 'ఛాన్సు దొరికెరా య్యా' అంటూ నువ్వు ఫుడ్డుకోసం దేబిరిస్తున్నప్పుడు వేశాడు వేటు అదే, రాయితో పోటు అంది డాంకీ. అదిరాయే కానీ మామూలు రాయి కాదు. కన్నుకు తగిలితే కన్నే పోయేది. నుదుటికి తగిలితే చిట్లిపోయేది. రాయా అది మాయదారి రాయి పలుగురాయి, గులకరాయోయి రాయి అని మళ్లీ కుయ్యో మొర్రో మన్నది డాగీ. మళ్లీమళ్లీ గుర్తు చేసుకుని ఏడవకు. ఎవడూ యూ ట్యూబులో పెట్టి నీ నొప్పిని ప్రచారం చేయడు. కట్టూ కట్టడు అని డాంకీ అంటుంటే అరుగు ఎక్కాడుఅబ్బాయి. కట్టు అంటున్నావు ఏమైందేమిటి? అన్నాడు. ఏముందీ వడ్ల గింజలో బియ్యపు గింజ. పేరూ, ఊరూ తెలీని వాడెవడో రాయి విసిరాట్ట. అది డాగీ వీపు నిమిరిందంట. తనేమైనా వీఐపీనా కట్టుకట్టడానికి, టీవీలో ప్రసారం చెయ్యడానికి అంది డాంకీ. యూ ఆర్ రైట్ డాంకీ. వీవీఐపీలకు, జెడ్ సెక్యూరిటీలు, వందల్లో పోలీసులు కాపలా కాస్తారు కాని మీకూ మనిషి నయినా మీలాగే అడ్రసులేని నాకూ ఎవరున్నారు చెప్పు అన్నాడబ్బాయి. మనకు లేకపోతే పోయిందేమీ లేదుకాని అన్నీ ఉన్నా మనుషుల మీద రాళ్లు పడుతున్నాయికదా? అంది డాంకీ. ఆ రాయి విసిరిన వాడు చీకట్లో ఎవరిమీదకు విసిరాడో, కావాలని తానే విసిరాడో, ఎవరైనా విసరమంటే విసిరాడో, తన గురి కర్రెక్టవునో లేదో నని విసిరాడో ఎవరికి తెలుసు, లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నారు కాదూ అంది డాగీ. వెనకటికి రాజులు ఎదురూ బదురూ నిలబడి కత్తులతో పొడ్చుకునే వాళ్లు, ఇప్పుడదేంలేదు. వీరు లేనప్పుడు వారు, వారు లేనప్పుడు వీరు బూతు పంచాంగ శ్రవణం చెయ్యడమే. ఇక రాళ్లూ రప్పలూ, కోడికత్తులూ, ప్రాణాల్తీయలేవుగాని సానుభూతి సంపాదించి పెడ్తవి. అవినిజంవి అయినా, డ్రామాలయినా కొద్దో గొప్పో ఓట్లు కొల్లగొట్టకపోవు అన్నాడబ్బాయి. అప్పుడు అన్ని పార్టీల వాళ్లు రాళ్లు విసిరించుకుంటేసరి అంది డాంకీ. నా మీద రాయి విసిరినోడు పారిపోయేడుకానీ, పెద్దోళ్లమీద రాయి విసిరితే అది గచ్చకాయంత రాయైనా సరే ఆ విసిరినోణ్ణి ఉరితీయరూ అంది డాగీ. నీమీద రాయి విసిరినోడిది హత్యాప్రయత్నమేనంటావా? అంది డాంకీ పళ్లికిలిస్తూ.

ప్రజలను మభ్యపెట్టే బీజేపీ మానిఫెస్టో

డా. జ్ఞాన్‌పాఠక్

ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజలను మభ్యపెడుతూ రానున్నకాలం బంగారు భవిష్యత్‌గా ఉంటుందన్నట్లుగా మాటల గారడీతో బీజేపీ 2024 ఎన్నికల మేనిఫెస్టో (ప్రణాళికను) విడుదల చేసింది. దీనికోసం సామాన్యప్రజలు ఏనాడూ ఎదురుచూడరు. అయినా తమ మేనిఫెస్టోకోసం ఎదురు చూస్తున్నారని ప్రధాని మోదీ చెప్పారు. నిర్దిష్టంగా పరిష్కరించే ఒక్క సమస్యను కూడా పేర్కొనలేదు. కచ్చితంగా అమలుచేసే గ్యారెంటీ ఒక్కటీ లేదు. గతంలో ఇచ్చిన గ్యారంటీలలో (హామీలలో) ఒక్కటీ నెరవేర్చలేదు. "మంచి పాలన అందిస్తాము" అని పేర్కొన్నారు. ఇంతవరకు అందించినపాలన సరైందికాదని మోదీ అంగీకరించారని అనుకోవాలి. దీని అర్థమేమిటో ప్రజలే ఊహించుకోవలసిందే. తాను పాలించిన పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధిని సాధించానని అందమైన చిత్రాన్ని మనకు చూపించారు. "మోదీ గ్యారంటీ 2024" అని ప్రధానమైన కొత్త నినాదాన్ని మోదీ సృష్టించారు. హామీలు అమలు చేయకపోయినా ఆయన అనేక ఆకర్షణీయ నినాదాలు ఇస్తుంటారు. ఇక మేనిఫెస్టో పుస్తకం మీద 'ఏక్ బార్, మోదీ సర్కార్' ఆడంబరమే కనిపిస్తుంది గానీ హామీలు చట్టబద్ధంగా నెరవేర్చేవి ఉండవు. అమలు జరిపేవీ కనిపించవు, విశ్వసనీయమైనవీకావు. అన్నీ 'మోసపు' హామీలే. ఇక ప్రతిపక్షాలన్నీ అవినీతి, కుంభకోణాలలో మునిగిపోయాయని గత పదేళ్లనుంచి ఆరోపిస్తూ ప్రచారం నిర్వహించడంతో సరిపోయింది. తమ పార్టీ ప్రభుత్వాలు, మంత్రులు, నాయకులు చేసిన కుంభకోణాలు, అక్రమాలను గురించి అసలు ప్రస్తావించరు. ఎన్నికల ప్రణాళికలోని 25 అధ్యాయాలలో 24 అధ్యాయాలలో మోదీ గ్యారంటీలే కనిపిస్తాయి. వీటి అర్థం ఏమిటో ప్రజలే ఊహించుకోవాలి. అన్ని హామీలు, మాటలు అస్పష్టమైనవే. నిర్దిష్టమైంది ఒక్కటీ ఉండదు. వ్యాపార ప్రకటనలున్నట్లుగా మోదీ హామీలుంటాయి. తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కొత్తసమస్యలు లేవనెత్తి ప్రజలను తప్పుదారి పట్టిస్తారు. తద్వారా ప్రభుత్వ తప్పిదాన్ని మభ్యపెడతారు. ఆయన గొప్పగా చెప్పే అభివృద్ధి అంతా సంపన్నులకేగానీ సామాన్య ప్రజలకు కాదు. 2014లో ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని, 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, 2025నాటికి ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను మన దేశం సాధిస్తుందని గొప్ప, గొప్ప వాగ్దానాలు చేశారు. ప్రస్తుతం మూడు ట్రిలియన్ల డాలర్లకు ఆర్థికవృద్ధి సాధించాలని ప్రచారం చేసుకుంటున్నారు. భారతదేశంలో ఆర్థికవ్యవస్థ తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందని అనేక జాతీయ, అంతర్జాతీయ సర్వేలు చెప్తున్నాయి. 76పేజీల ఎన్నికల ప్రణాళికలోనూ 67 చోట్ల మోదీ పేరు వచ్చింది. బీజేపీ నాయకులంతా మోదీ భజన చేస్తారు. అధికారమంతా మోదీ పరిధిలో కేంద్రీకృతమైంది. ఎన్నికల ప్రణాళిక వ్యాపారప్రకటన కరపత్రంలాగా ఉంది. తమ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని చెప్పుకుంటారు. అదెక్కడా కనిపించదు. మోదీ చెప్పినట్లు వినడమే కనిపిస్తుంది. మేనిఫెస్టోలో ఒకే ఒకపేజీలో మాత్రమే "పదేళ్ల మంచి పరిపాలన, వికాస్(అభివృద్ధి) ఉన్నాయి. ఇందులోనూ పొగడ్తలు, మోదీ పాలన సాధించిన కొన్ని విజయాలంటూ ఎంపికచేసినవిగా పేర్కొన్నారు. పైగా దీని పేరు 'సంకల్ప యాత్ర' అంటూ పేరుపెట్టారు. 25కోట్లమందిని పేదరికం నుండి బైటపడవేశామని, 2013 వరకు అనేకమంది ఆహారభద్రతా చట్టపరిధిలో ఉన్నారని తమ ప్రభుత్వ గొప్పతనమని పేర్కొన్నారు. మరోవైపు 80కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నామని మోదీ చెప్పారు. పేదరికం నుండి 25కోట్లమంది బైటపడిఉంటే, 80కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ ఎందుకు? అన్నిటిలోనూ ఇలా ప్రజలను మభ్యపెట్టడంలో మోదీ ఆరితేరిన నాయకుడు. మోదీ ప్రకటనల్లో 'ప్రియమైన', 'కుటుంబ సభ్యుల్లారా' అనేపిలుపు మన దేశానికి సంబంధించిన వారిని ఉద్దేశించింది కాదు. ఆయన చర్యలు అత్యంత అధ్వాన్నంగా ఉంటాయి. రాజకీయంగా, సైద్ధాంతికంగా అన్నీ తిరోగమ నాలే. ఆయనపాలన తరచుగా నియంతృత్వంగా ఉంటుంది. ఇట్లా ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రణాళికలో మంచి పరిపాలన అని పేర్కొన్నారు. ఇది విచిత్రమైన వ్యవహారం.

ఎన్నికల ప్రణాళిక వాగ్దానాల సమీకరణలా ఉంది. అంతేకాదు, వాగ్దానాల సమీకరణ కాకుండా సేకరించిన ఆకాంక్షలు, లక్ష్యాలు అని చెప్పవచ్చు. మోదీ గ్యారంటీలు అనే మాటకు అర్థంలేకుండా పోయింది. గతపదేళ్లలో మోదీ ఇచ్చిన గ్యారంటీలన్నీ నెరవేర్చినట్లుగా పేర్కొన్నారు. మోదీ పదేళ్లకాలంలో పెట్టుబడీదారీ విధానం మరింత గాఢమైంది. పెట్టుబడీదారీ వ్యవస్థలో మోదీ కాలంలో 60శాతం జాతీయ సంపత్తిలో కేవలం 20కంపెనీలు ఎక్కువ స్వాయత్తం చేసుకున్నాయి. 70శాతం జాతీయ ఆదాయం వీరికే లభించింది. ఇక పేదలు ఎక్కడున్నారని మోదీ ప్రశ్నిస్తున్నారు. 97కోట్ల మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందడంలేదు. వలసలు వెళ్లిన 8కోట్ల మంది కార్మికులకు ఆహారధాన్యాలు సబ్సిడీ రేట్లపైన అందడంలేదు. వీరందరికీ ఉచితంగా ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజల కష్టాలకు సంబంధించిన వాస్తవాలు భీతిగొల్పుతున్నాయి. అయితే వీటన్నింటినీ ఎన్నికల ప్రణాళికలో ప్రస్తావించకుండా కప్పిపెడుతున్నారు. కేవలం కొత్తకొత్త నినాదాలతోనే పరిపాలన సాగిస్తున్నారు. మన దేశ పథాన్ని 2024సార్వత్రిక ఎన్నికలు నిర్వచిస్తాయని నడ్డా చెప్పారు. ఎన్నికల ప్రణాళిక కమిటి చైర్ పర్సన్ రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ, 140కోట్లమంది భారతీయుల అకాంక్షలను సంకల్ప పత్ర ప్రతిబింబిస్తుందని చెప్పారు. మన ఆకాంక్ష లను, కలలను నెరవేర్చేందుకు మోదీ అవిశ్రాంతంగా కష్టపడుతున్నారని రాజ్‌నాథ్‌సింగ్ మోదీని పొగిడారు. గత పదేళ్లకాలంలో విశిష్టతరహా సమ్మిళిత అభివృద్ధిని సాధించి ప్రపంచానికి చూపించామని పేర్కొన్నారు. అయితే ప్రణాళికలో చెప్పిన అభివృద్ధి క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించదు. అంతేగాక, ఆర్థిక, సామాజిక అసమానతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొద్దిమంది చేతుల్లోనే సంపద, ఆదాయాలు కేంద్రీకృతమైనప్పుడు అది సమ్మిళిత అభివృద్ధి ఎలా అవుతుంది? అసలు బీజేపీ మానిఫెస్టో అర్థం ఏమిటో నిజంగా ఎవరికీ అర్థంకాదు. తనపాలనలో పేదకుటుంబాలకు అనేక ప్రయోజనాలు కల్పించినట్లుగా ప్రాధాన్యత అంశంగా చేర్చారు. మహిళా సాధికారత, యువతకు కొత్తఅవకాశాలు, రైతులకు ఊరట కల్పించినట్లుగా పేర్కొన్నారు. అలాగే వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలను 90శాతం వెనుకబడిన తరగతులకు కల్పించామని పేర్కొన్నారు. ఓబీసీ, ఎస్‌సీ,ఎస్‌టీ వర్గాలకు మంత్రిపదవులు ఇచ్చామని ప్రణాళికలో చేర్చారు. అయితే వాస్తవాన్ని ఈ మంత్రులకు ఆచరణలో ఎలాంటి అధికారాలు కనిపించవు. అన్నీ మోదీ చేతులమీదుగానే జరుగుతాయి. ఎందుకంటే ఆయన పాలన ఏకవ్యక్తి పాలన.

ఫలితమివ్వనున్న న్యాయయాత్ర

టి.వి.సుబ్బయ్య

దేశంలో ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల్లో మొదటి దశలో ఈనెల 19న జరగనున్న పోలింగ్‌లో బీజేపీతో కాంగ్రెస్ దాదాపు సమానంగా సీట్లు గెలవనున్నదన్న సంకేతాలున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తం 25 లోక్‌సభ సీట్లుండగా మొదటి దశలో 14 నియోజకవర్గాల్లో పోలిగ్ జరుగుతుంది. బీజేపీ 6 సీట్లలో, దాని మిత్రపక్షాలు రెండు స్థానాల్లో, కాంగ్రెస్ 5 సీట్లలో, దాని మిత్రపక్షాలు 2 సీట్లలో పైచేయిగా ఉన్నాయని అంచనాలు వచ్చాయి. అరుణాచల ప్రదేశ్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు పోటీపడుతున్నాయి. బీజేపీ అభ్యర్థిగా కిరణ్ రిజిజు రాష్ట్రంలో పశ్చిమ నియోజక వర్గంలో పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నబంటుకి కంటే కిరణ్‌రిజిజు పైచేయిగా ఉన్నారు. మరో ముఖ్యమైన అభ్యర్థి గణ సురక్ష పార్టీకి చెందిన టొకో శీతల్ కూడా ఇక్కడ పోటీ చేస్తున్నారు. తపీర్‌గవో (బీజేపీ) అరుణాచలప్రదేశ్ తూర్పు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బోసిరాం సిరం, తపీర్ గవోల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ ఉంది. అరుణాచల్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కూడా పోటీలో ఉన్నారు. 2019లో ఈ రెండు సీట్లను బీజేపీ గెలుచుకుంది. మొదటిదశలో అసోంలో కజిరంగ, సొనిట్‌పూర్,లఖింపూర్,దిబ్రూఘర్, జోర్హట్ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. ఇండియా కూటమిలో అసోం జాతీయ పార్టీ, కాంగ్రెస్‌లు కలిసి పోటీ చేస్తున్నాయి. అలాగే బీజేపీ, అసోం గణ పరిషత్, యునైటెడ్ పీపుల్స్ పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. కజిరంగలో బీజేపీ నుంచి కామాఖ్య ప్రసాద్ తస, కాంగ్రెస్ అభ్యర్థిగా రోజ్‌లిన టిర్కి పోటీచేస్తుండగా కాంగ్రెస్ పైచేయిగా ఉంది.

సొనిత్‌పూర్‌లో బహుపక్షాల మధ్య పోటీ ఉంది. రంజిత్ దత్తా (బీజేపీ), ప్రేమ్‌లాల్‌గంజ్ (కాంగ్రెస్), ప్రధాన అభ్యర్థులు, అయితే ఆప్ అభ్యర్థి అజిరాజ్‌శర్మ, బీపీఎఫ్ అభ్యర్థిరాజు దియురి రంగంలో ఉన్నారు. వీరు లేకపోతే కాంగ్రెస్‌కు విజయావకాశాలున్నాయి. అలాగే లఖింపూర్‌లో బీజేపీ అభ్యర్థి ప్రధాన భారువ, కాంగ్రెస్ తరఫునన ఉదయ్ శంకర్ హజారిక, ఏటీసీ అభ్యర్థి ఘణకాంత్ ఛుటియ, సీపీఐ అభ్యర్థి ధిరేన్ కచారిలు పోటీ చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, మధ్య గట్టిపోటీ నెలకొంది. దిబ్రూఘర్, జోర్‌హట్‌లో ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. దిబ్రూ ఘరల్ బీజేపీ, ఆప్, ఏజీపీ మధ్య ప్రధానపోటీ ఉంది. జోర్‌హట్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ. 2023లో మణిపూర్‌లో కల్లోలం ఏర్పడి ప్రజల జీవనం దుర్భరమైంది. ఇన్నర్ మణిపూర్, ఔటర్ మణిపూర్ సగంలో మొదటి దశలో పోలింగ్ జరుగుతుంది. మరో సగం ఔటర్ మణిపూర్‌లో రెండవ దశలో ఏప్రిల్ 26న జరుగుతుంది. మణిపూర్ ప్రజలు ప్రధాని మోదీపై ఆగ్రహంతో ఉన్నారు. మణిపూర్‌లో రాహుల్ పర్యటనకు మంచి ఆదరణ లభించింది. ఇక్కడ బీజేపీ, నాగా పీపుల్స్ ఫ్రంట్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఇప్పటికీ తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనిఉన్న మణిపూర్‌లో గట్టిపోటీ ఉంది. మెజారిటీ వర్గం మెయితీలు బీజేపీని రెచ్చగొట్టడం వల్లనే అనేక నెలలుగా ఘర్షణలు, హింసాకాండ జరిగింది. ఇన్నర్ మణిపూర్‌లో బీజేపీ అభ్యర్థి టి.ఓ సంపత్‌కుమార్ సింగ్, కాంగ్రెస్ అభ్యర్థి అంగోమ్ చబిమోల్ అకోయి జమ్‌ల మధ్య గెలుపు నువ్వానేనా అన్నట్లు పరిస్థితి ఉంది. ఔటర్ మణిపూర్‌లో కాంగ్రెస్ అబ్యర్థి ఆల్‌ఫ్రెడ్ కన్‌నగమ్ ఆర్థర్, ఎన్‌పీఎఫ్ అభ్యర్థి కచూరి తిమోతీజిమిక్ మధ్య గట్టిపోటీ ఉంది. రాష్ట్రంలో ఇప్పటికీ జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈసారి బీజేపీకంటే కాంగ్రెస్ మెరుగైన పరిస్థితిలోఉంది.

ఇక మేఘాలయ రెండు సీట్లలోనూ బీజేపీ పోటీ చేయడంలేదు. ఎన్‌డీఏలో భాగస్వామి అయిన నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ రెండు సీట్లలోనూ పోటీ చేస్తోంది. రెండు సీట్లలోనూ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఇంకా ఇతర చిన్న పార్టీలు పోటీరంగంలో ఉన్నాయి. షిల్లాంగ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విన్సెంట్ పాల్‌తోపాటు మరికొన్ని చిన్నపార్టీలు కూడా పోటీ చేస్తున్నాయి. అలాగే తురలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రముఖ నాయకుడు ఎ సంగ్మా గాకుండా మరికొన్ని చిన్న పార్టీలు పోటీ చేస్తున్నాయి. షిల్లాంగ్‌లో కాంగ్రెస్ పైచేయిగా ఉంది. తురలో ఏఐటీసీ ఉన్నందున కాంగ్రెస్ కాస్త బలహీనంగా ఉంది. ఈ సీటుపైన తృణమూల్ కాంగ్రెస్ శ్రద్ధ వహించి పోటీ చేస్తోంది. ఇక నాగాలాండ్‌లోనూ మొదటిదశలోనూ పోలింగ్ జరుగుతుంది. మిజోరంలోని ఏకైక సీటులో ప్రధానంగా ఎంఎఫ్, జెడ్‌పీఎమ్, కాంగ్రెస్, బీజేపీ, ఎంపీసీలు పోటీపడుతున్నాయి. జడ్‌పిఎం పార్టీ అన్ని పార్టీలకంటే పైచేయిగాఉందని అంచనా. నాగాలాండ్‌లోని ఏకైక సీటులో బీజేపీ పోటీ చేయడంలేదు. ఇక్కడ ఎన్‌డీపీపీ, కాంగ్రెస్‌ల మధ్య పోటీ ఉంది. సిక్కింలో ఉన్నఒకే ఒక సీటులో ఎస్‌కెఎమ్, ఎస్‌డీఎఫ్, కాంగ్రెస్ పోటీలోఉన్నప్పటికీ, ఎస్‌కేఎంది పైచేయిగా ఉంది. త్రిపురలో రెండు సీట్లున్నాయి. వీటిలో ఒకటి మొదటి దశలోనే పోలింగ్ జరుగుతుంది. తిప్ర మొథ పార్టీతో కలిసి బీజేపీ త్రిపుర పశ్చిమప్రాంతంలో పోటీ చేస్తోంది. మరో సీటులో కాంగ్రెస్, సీపీఎంలు ఇండియాకూటమిలో భాగంగా పోటీ చేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థి బిబ్‌లాబ్ కుమార్ కాంగ్రెస్‌అభ్యర్థి ఆశిశ్‌కుమార్‌ల మధ్య నువ్వా నేనా గెలుపు అన్నట్లుగా ఉంది.

పేదల కోసం ఏమీ లేదు

బీజేపీ మేనిఫెస్టోను దుయ్యబట్టిన రాహుల్ గాంధీ

ఉదగమండలం (తమిళనాడు): బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేదల కోసం ఏమీ లేదని, అయితే 2036 ఒలింపిక్స్ నిర్వహణ గురించి మాత్రం మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం విమర్శించారు. తమిళనాడులోని నీలగిరి జిల్లాలో తన పర్యటన సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అనే తన అజెండాను ముందుకు తెచ్చేందుకు బీజేపీ ఆసక్తిగా ఉందన్నారు. 'పేదల కోసం బీజేపీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి?' అని కేరళలోని వయనాడ్‌కు వెళ్లే ముందు ఇక్కడి తాలూర్ కళాశాల విద్యార్థులతో సంభాషించిన సందర్భంగా రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన విధానాలు ఉన్నాయి. కానీ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో 2036లో ఒలింపిక్స్ నిర్వహించడం గురించి మాట్లాడుతుంది. ఇది కాంగ్రెస్, బీజేపీ మధ్య వ్యత్యాసం' అని ఆయన అన్నారు.

మోదీ ఆలోచన యువతను అవమానించడమే

వయనాడ్ (కేరళ) : ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి 'దేశంలో ఒకే నాయకుడు' అనే ఆలోచనను అధికార బీజేపీ ప్రయోగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇది ప్రతి భారతీయ యువతీయువకులను, దేశ ప్రజలను అవమానించడమేనన్నారు. భారతదేశం పూలగుత్తి లాంటిదని, ప్రతి ఒక్కరినీ గౌరవించాలని, ఎందుకంటే ఇది మొత్తం పుష్పగుచ్ఛానికి అందాన్ని పెంచుతుందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన నియోజకవర్గంలో తన పార్టీ కార్యకర్తలు, ఓటర్లను ఉద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడుతూ భారతదేశం ఎందుకు ఎక్కువ మంది నాయకులను కలిగి ఉండకూడదని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్, బీజేపీ మధ్య వ్యత్యాసానికి సంబంధించిన ప్రధాన రేఖగా నొక్కి చెప్పారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇవాళ కీలక పోరాటం జరుగుతున్నదన్నారు. కాషాయ నేతలు, ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు 'ఒకే దేశం... ఒకే ఎన్నికలు, ఒకే నేత, ఒకే భాష అని మాట్లాడుతున్నారని, భాష గురించి ఏ ఒక్కరూ ప్రజలను నిర్దేశించలేరని స్పష్టం చేశారు. భాష అనేది మనిషి లోపలినుంచి, హృదయం నుంచి పలికేదని చెప్పారు. హిందీ కంటే మీ భాష తక్కువని కేరళక చెందిన వ్యక్తితో అనడమంటే అది కేరళ ప్రజలను అవమానించినట్టేనని పేర్కొన్నారు. దేశంలోని ప్రజల మాటలను వినాలని, వారి విశ్వాసాలు, భాష, మతం, సంస్కృతిని ప్రేమించాలని, గౌరవించాలని కాంగ్రెస్ కోరుకుంటుండగా, బీజేపీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'ఆర్ఎస్ఎస్ భావజాలం ద్వారా ఏర్పడిన బ్రిటీష్ వారి వలసరాజ్యం నుంచి మనకు స్వేచ్ఛ లభించలేదు. భారతదేశాన్ని ప్రజలందరూ పాలించాలని మేము కోరుకుంటున్నాము' అని ఆయన అన్నారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ భారీ రోడ్ షోను కూడా నిర్వహించారు. రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల తేదీ ప్రకటించిన తర్వాత రెండవసారి నియోజకవర్గానికి వచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గాంధీ వయనాడ్ నుంచి రికార్డు స్థాయిలో 4,31,770 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

రాహుల్ హెలికాప్టర్ తనిఖీ

రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేశారు. నీలగిరి జిల్లాలో ఆయన కోసం వచ్చిన హెలికాప్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. రాహుల్ సోమవారం ఉదయం తమిళనాడు నీలగిరి జిల్లా నుంచి తన సొంత నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌కు వెళుతున్నారు. ఆయన్ని తీసుకెళ్లేందుకు హెలికాప్టర్ వచ్చింది. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అక్కడికి చేరుకొని తనిఖీ చేసినట్లు స్థానిక పోలీసు అధికారులు తెలిపారు.

అవకాశాలు, ఉద్యోగాలకు అవినీతి 'పాస్‌వర్డ్' కాదు: ధన్కర్

నాగపూర్ (మహారాష్ట్ర): అధికారగణంలో అవినీతిపరులకు అడ్డుకట్ట పడుతోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. అవకాశాలు, ఉద్యోగాలకు ఇక అవినీతి అనేది ఓ పాస్‌వర్డ్‌లా ఉండదన్నారు. నాగపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌లో ఐఆర్ఎస్ 76వ బ్యాచ్ వీడ్కోలు సభలో ధన్కర్ ప్రసంగించారు. 'నేడు మీ అందరికీ ఒకటి చెప్పాలనుకుంటున్నా, పరిపాలనను అవినీతి ఎప్పటికీ శాసించలేదు. ఇకపై అవినీతి అనేది అవకాశం, ఉద్యోగం లేదా కాంట్రాక్టుకు 'పాస్‌వర్డ్' కాదు. అది జైలుకెళ్లే మార్గం. అధికారగణంలో అవినీతి శక్తులకు అడ్డుకట్ట పడుతోంది. నిద్రాణస్థితి నుంచి మేలుకున్న భారత్... ప్రపంచశక్తిగా ఎదిగే దిశగా వేగంగా దూసుకుపోతోంది. జీ-20 సదస్సుకు ప్రాతినిధ్యం వహించే సమయంలో భారత్... దక్షిణ దేశాల గొంతుకగా మారింది. ప్రస్తుతం మన దేశం ప్రముఖ వేదికగా మారింది. భారత్ దూరదృష్టి, నాయకత్వాన్ని చూస్తుంటే గర్వంగా ఉంది' అని అన్నారు. ఐఆర్ఎస్ అధికారులకు సాంకేతికత పరిజ్ఞానం అవసరాన్ని ధన్కర్ నొక్కి చెప్పారు. నేటి సమాజంలో నగదు నిర్వహణ అనేది ముప్పుగా మారిందన్నారు. సాంకేతికత అనేది అనధికారిక నిర్వహణను నిరుత్సాహపరుస్తుందని, ఇది సమాజాన్ని దెబ్బతీస్తుందన్నారు. కానీ, నేడు అవినీతిని సహించలేని విధంగా భారత్ రూపుదిద్దుకుందన్నారు. వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

సంఘ వ్యతిరేకులతో 'రహస్య బంధం'

రాహుల్‌పై మోదీ విమర్శ

పాలక్కాడ్: సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో నిషేధానికి గురైన ఒక సంస్థకు చెందిన రాజకీయ విభాగంతో కాంగ్రెస్ సీనియర్ నేత, వయనాడ్ సిట్టింగ్ ఎంపీ రాహుల్ గాంధీ 'రహస్య ఒప్పందం' కుదుర్చుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆయన కుటుంబానికి అండగా నిలిచిన నియోజకవర్గాన్ని కూడా రాహుల్ పక్కన పెట్టేశారని వ్యాఖ్యానించారు. పాలక్కాడ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ కేరళలో ప్రజా సమస్యలు ప్రస్తావించకుండానే కాంగ్రెస్ క్రౌన్ ప్రిన్స్(యువరాజు) ఓట్లు అడుగుతున్నారని ఆరోపించారు. లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ హెచ్చరించారు. కేరళలో వామపక్షాలను టెర్రరిస్టులుగా పోల్చి, వారితోనే ఢిల్లీలో చెట్టపట్టాలు వేసుకుని తిరగడం కాంగ్రెస్ పార్టీ వంచనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఎల్‌డీఎఫ్-యూడీఎఫ్ హయాంలో కేరళలో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారులు సహా ఎన్డీయే ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అవరోధాలు కల్పిస్తోందన్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను మోదీ ప్రస్తావిస్తూ ఇది దేశ అభివృద్ధికి కట్టుబడి, మోదీ గ్యారెంటీలతో రూపొందించిన మేనిఫెస్టో అని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేరళలోని 73 లక్షల మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఉచిత చికిత్స అందిస్తామని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 'వికాస్', 'విరాసత్' అనేది బీజేపీ విజన్ అని తెలిపారు. సహజ సౌందర్యానికి ప్రతీక పాలక్కాడ్ అని కొనియాడారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, హైస్పీడ్ వందే భారత్ రైళ్లతో కేరళను గ్లోబల్ హెరిటేజ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు.

కేజ్రీవాల్‌ను నేరస్తుడిలా చూస్తున్నారు

పంజాబ్ సీఎం మాన్ భావోద్వేగం

న్యూఢిల్లీ: తీహార్ జైలులో అరవింద్ కేజ్రీవాల్‌ను కరడుగట్టిన నేరస్తుడి కంటే దారుణంగా చూస్తున్నారని, గ్లాస్ వాల్ గుండా ఫోనులో ఆయన తనతో మాట్లాడారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తెలిపారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తీహార్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను భగవంత్ మాన్ సోమవారం కలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'గ్లాసు గోడ మరకలతో మసకమసకగా ఉంది. ఒకరి ముఖం మరొకరు చూసుకోవడం కూడా కష్టమైంది. ఎలా ఉన్నారని ఆయనను అడిగాను. ఆయన తన గురించి చెప్పలేదు. పంజాబ్ గురించి అడిగారు. రైతులు ఏం చేస్తున్నారు? పంట కోతలు మొదలయ్యాయా? అని అడిగారు. ఆప్ మొహల్లా క్లినిక్‌ల గురించి విచారించారు. ప్రజలకు సకాలంలో ఉచిత కరెంట్ అందుతోందా అని అడిగారు. ఆయన ఆందోళన అంతా ప్రజల గురించే. ప్రజలకు పని చేయడం కోసం రాజకీయాలు ఉంటాయి కానీ రాజకీయాల కోసం రాజకీయాలు చేయం. మేము దేశభక్తులం. దేశం కోసమే మా పోరాటం' అని మాన్ చెప్పారు. కరడుగట్టిన నేరస్థులకు దక్కే సౌకర్యాలు కూడా కేజ్రీవాల్‌కు ఇవ్వడం లేదని, ఆయన చేసిన నేరం ఏమిటని మాన్ ప్రశ్నించారు. కేజ్రీవాల్ ప్రజలకు ఉచిత విద్యుత్ ఇచ్చారని, మొహల్లా క్లినిక్‌లతో ఉచిత వైద్యం అందజేశారని చెప్పారు. జైలు నిబంధనల ప్రకారం సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విజిటర్లతో ముఖాముఖీ మాట్లాడేందుకు అనుమతిస్తుంటారని చెప్పారు. చిదంబరం జైలులో ఉన్నప్పుడు ఆయనతో ముఖాముఖీ జరిపేందుకు సోనియాగాంధీని అనుమతించారని, ప్రకాశ్‌సింగ్ బాదల్‌ను సైతం ఒక రూములో ముఖాముఖీకి అనుమతించారని గుర్తుచేశారు. కేజ్రీవాల్ విషయంలో ఏ తరహా శత్రుత్వం ఉందో తనకు అర్థం కావడం లేదని మాన్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ వెంట తాము బలంగా నిలబడతామని, జూన్ నాల్గవతేదీ తరువాత వెలువడే ఎన్నికల ఫలితాలతో అతిపెద్ద రాజకీయ శక్తిగా ఆప్ అవతరించడం ఖాయమని మాన్ జోస్యం చెప్పారు.

ట్రక్కును ఢీకొట్టిన కారు... ఏడుగురి సజీవదహనం

సికార్ (రాజస్థాన్): ట్రక్కును కారు ఢీకొనడంతో ఏడుగురు సజీవదహనమైన ఘటన రాజస్థాన్‌లో జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నివాసితులు రాజస్థాన్‌లోని సలాసర్‌లో ఉన్న సలాసర్ బాలాజీ ఆలయం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. చురు వైపుగా వెళుతున్న కారు డ్రైవర్ ట్రక్కును ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించాడు. ఇంతలో ఎదురుగా మరో వాహనం రాగానే ఆ వాహనాన్ని ఢీకొట్టకుండా చేసే ప్రయత్నంలో అదుపుతప్పి ట్రక్కును ఢీకొట్టాడు. దీంతో వెంటనే కారులోని గ్యాస్ కిట్‌లో మంటలు రాజుకున్నాయి. ట్రక్కులో లోడ్ చేసి ఉన్న కాటన్ ఆ మంటలను ఇంకా చెలరేగేలా చేసింది. గమనించిన స్థానికులు వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మంటలు ఎక్కువ కావడంతో లాక్ చేసి ఉన్న డోర్లను తీయకపోవడంతో కారులో ఉన్నవారంతా సజీవదహనమయ్యారు. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు సహా ఏడుగురు సజీవ దహనమయ్యారు. ఇంతలో లారీ డ్రైవర్, హెల్పర్ ఘటనా స్థలం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన రామ్‌నివాస్ సైనీ మాట్లాడుతూ ప్రయాణికులు సహాయం కోసం అరుస్తున్నారని, అయితే మంటల కారణంగా తాను వారికి సహాయం చేయలేకపోయానని చెప్పారు. అగ్నిమాపక దళం వాహనాలను మోహరించింది. అయితే మంటలను అదుపులోకి తెచ్చే సమయానికి కుటుంబ సభ్యులు మరణించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను నీలం గోయల్ (55), ఆమె కుమారుడు అశుతోశ్ గోయల్ (35), మంజు బిందాల్ (58), ఆమె కుమారుడు హార్దిక్ బిందాల్ (37), అతడి భార్య స్వాతి బిందాల్ (32), వారి ఇద్దరు మైనర్ కుమార్తెలుగా గుర్తించారు.

రూ.200 కోట్ల ఆస్తి దానం...

సన్యాసంలోకి భార్యభర్తలు

గాంధీనగర్ (గుజరాత్): వ్యాపార సామ్రాజ్యం... వందల కోట్ల ఆస్తులు... సమాజంలో బోలెడంత పలుకుబడి... కానీ ఇవేవీ వాళ్లిద్దరికి సంతృప్తినివ్వలేదు. అందుకే ఇప్పటికే సన్యాసం స్వీకరించిన కొడుకు, కుమార్తెల బాటలో నడిచేందుకు సిద్ధమయ్యారు భార్యభర్తలు. ఇప్పుడు ఈ కుబేరుల నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... గుజరాత్‌లోని సబర్‌కాంత జిల్లా వాసి భావేశ్ భండారి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఊహించనంత లాభాలను కళ్ల జూశారు. ఆస్తుల్ని కూడబెట్టుకున్నారు. కానీ ఈ ఆస్తిపాస్తులు, వ్యాపారం ఆ దంపతులకు ఏ మాత్రం సంతృప్తి నివ్వలేదు. భావేశ్ భండారి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరూ ఇప్పటికే సన్యాసం స్వీకరించారు. తల్లిదండ్రులు కూడా కుమార్తె (19), కుమారుడు (16) బాటలో నడిచేందుకు సిద్ధమయ్యారు. పిల్లలిద్దరూ 2022లో సన్యాసం తీసుకున్నారు. వారి నుంచి ప్రేరణ పొందిన భావేశ్ భండారి దంపతులు... తమ పిల్లలులాగే తాము కూడా భౌతిక అనుబంధాలను త్యజించి, సన్యాసి మార్గంలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సన్యాసానికి సంబంధించి ఫిబ్రవరిలో జరిగిన ఓ వేడుకలో భావేశ్ భండారి, అతడి భార్య తమ సంపద రూ.200 కోట్ల మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ నెల 22న జరిగే కార్యక్రమంలో అధికారికంగా సన్యాసం తీసుకోనున్నారు. మోక్షం పొందేందుకు యాత్రకు బయలుదేరాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. భండారీ దంపతులు, మరో 35 మందితో కలిసి నాలుగు కిలోమీటర్ల మేర ఊరేగింపుగా బయలుదేరనున్నారు. అక్కడ వారు తమ యావదాస్తుల్ని వదిలేయనున్నారు. ఆ తర్వాత రెండు తెల్లని వస్త్రాలు ధరిస్తారు. భిక్ష కోసం ఒక గిన్నె తీసుకుని దేశమంతటా చెప్పులు లేకుండా ప్రయాణిస్తారు. భిక్షతో మాత్రమే జీవిస్తారు.

మోదీ ప్రత్యర్థి ట్రాన్స్‌జండర్

లక్నో: వారణాసి లోక్‌సభ స్థానానికి ప్రధాని మోదీపై అఖిల భారత హిందూ మహాసభ నుంచి మహామండలేశ్వర్ హేమాంగీ సఖి పోటీ చేస్తున్నారు. అఖిల భారత హిందూ మహాసభ ఉత్తరప్రదేశ్ శాఖ రాష్ట్రంలో 20 లోక్‌సభ స్థానాల నుంచి తమ అభ్యర్థులను రంగంలోకి దింపింది. దీనిలో భాగంగా వారణాసి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ట్రాన్స్‌జెండర్ మహామండలేశ్వర్ హేమాంగీ సఖి ఎన్నికల బరిలోకి దిగారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల సాధన కోసం తాను ఎన్నికల బరిలోకి దిగినట్లు హేమాంగీ సఖి తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలలో ట్రాన్స్‌జెండర్లకు సీట్లు కేటాయించాలని హేమాంగీ సఖి డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడిన హేమాంగీ సఖి నేటికీ ట్రాన్స్‌జెండర్లు భిక్షాటన చేయడం ద్వారా పొట్టపోసుకుంటున్నారని, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వం ఎటువంటి సాయం అందించడం లేదని వాపోయారు. తాను కాశీలోని విశ్వేశ్వరుణ్ణి దర్శించుకున్నాక ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని తెలిపారు. హేమాంగీ సఖి భాగవత కథను పంజాబీ, గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ మొదలైన భాషలలో వివరిస్తారు. భారతదేశంతో పాటు బ్యాంకాక్, సింగపూర్, మారిషస్ మొదలైన దేశాలలో హేమాంగీ సఖి భాగవత కథను వినిపించారు. ట్రాన్స్‌జెండర్ మహామండలేశ్వర్ హేమాంగీ సఖి తల్లి పంజాబీ. తండ్రి గుజరాతీ. హేమాంగీ సఖి తన బాల్యాన్ని మహారాష్ట్రలో గడిపారు. తల్లిదండ్రులు మరణించాక హేమాంగీ సఖి బృందావనం చేరుకుని, అక్కడ అనేక గ్రంథాలు అధ్యయనం చేశారు. కాగా వారణాసి లోక్‌సభ స్థానానికి ఏడో దశలో అంటే చివరి దశలో ఓటింగ్ జరగనుంది. వారణాసి పార్లమెంట్ నియోజకవర్గంలో వివిధ పార్టీలు ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తున్నాయి.

బీజేపీ నేతల హెలికాప్టర్లు తనిఖీ చేయగలరా?

ఐటీ అధికారులకు మమత సవాల్

కూచ్‌బెహర్ (పశ్చిమ బెంగాల్): ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ నాయకులు వినియోగిస్తున్న హెలికాప్టర్లను తనిఖీ చేసేందుకు ఆదాయ పన్ను విభాగం (ఐటీ) అధికారులకు ధైర్యం ఉందా అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం సవాల్ విసిరారు. తమ పార్టీ నాయకుడు అభిషేక్ బెనర్జీ ఉపయోగించిన హెలికాప్టర్ లక్ష్యంగా ఐటీ అధికారులు దాడి చేశారంటూ టీఎంసీ పేర్కొనడంపై వివాదం చెలరేగిన ఒక రోజు తర్వాత టీఎంసీ అధినేత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కూచ్ బెహార్‌లో జరిగిన ర్యాలీలో బెనర్జీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీఎంసీకి వ్యతిరేకంగా బీజేపీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 'ట్రయల్ రన్‌కు ముందు అభిషేక్ బెనర్జీ హెలికాప్టర్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సోదాలు చేశారు. కానీ ఏమీ కనుగొనలేదు. హెలికాప్టర్‌లో డబ్బు, బంగారం ఉన్నట్లు తమకు సమాచారం ఉందని ఐటీ అధికారులు పేర్కొన్నారు. కానీ వారు ఏమీ కనుగొనలేదు. మేము అలాంటి చర్యలకు పాల్పడము' అని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి పనులకు పాల్పడింది బీజేపీయేనని, అయితే బీజేపీ నేతల హెలికాప్టర్లను తనిఖీ చేసేందుకు కేంద్ర సంస్థ అధికారులు ఎప్పుడైనా సాహసిస్తారా అని అన్నారు. కోల్‌కతాలోని బెహలా ఫ్లయింగ్ క్లబ్‌లో తమ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హెలికాప్టర్‌పై ఆదాయ పన్ను విభాగం అధికారులు దాడి చేశారని, రాజకీయంగా ప్రత్యర్థి అభ్యర్థులను వేధించడానికి, బెదిరించేందుకు బీజేపీ ఉద్దేశపూర్వకంగా పన్నిన కుట్రలో ఇది భాగమని తృణమూల్ కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. కాగా, ఈ వివాదంపై ఐటీ వర్గాలు మాత్రం సోదాలు ఏవీ చేపట్టలేదని, ఆ హెలికాప్టర్‌లో టీఎంసీ నాయకుడు పేర్కొన్నాయి. అయితే బీజేపీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేసిందని మమతా బెనర్జీ ఆరోపించారు. 'మొదటి దశ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీజేపీ మా నాయకులను అరెస్టు చేయడానికి ఎన్ఐఏను ఉపయోగించవచ్చు. తద్వారా వారు స్వేచ్ఛగా నడుచుకోవచ్చు' అని ఆమె అన్నారు.

ఒకే కుటుంబం... 350 మంది ఓటర్లు!

దిస్పూర్: దేశం మొత్తం ఓట్ల పండుగ జరుగుతోంది. రాజకీయ నాయకులంతా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎక్కడ ఓటరుంటే అక్కడ నాయకులు వాలిపోతున్నారు. ఏ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయనే లెక్కలు తీస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ కుటుంబంలో ఏకంగా 1,200 మంది జనాభా ఉండగా... ఆ కుటుంబంలో 350 మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి కుటుంబాల్లోనూ మహా అయితే ఓ 30 నుంచి 40 మంది కలిసి ఉంటుంటారు. ఇది ఉమ్మడి కుటుంబం కూడా కాదు. ఒకే వ్యక్తికి చెందిన కుటుంబం. ఆయన కుమారులు, కుమార్తెలు, వారి పిల్లలు వీళ్లంతా కలిపి 350 మంది ఓటర్లు ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. అంతమంది ఓటర్లున్న ఆ కుటుంబం అసోంలోని సోనిత్‌పూర్ జిల్లా ఫులోగురి నేపాలీ పామ్ గ్రామంలో ఉంది. ఇదే ప్రాంతానికి చెందిన దివంగత రాన్ బహదూర్ థాపా కుటుంబం దేశంలో అత్యధిక ఓటర్లను కలిగి ఉన్న కుటుంబంగా రికార్డు నెలకొల్పింది. రాన్ బహదూర్ థాపాకు ఐదుగురు భార్యలు. వీరికి 12 మంది కుమారులు, తొమ్మిది మంది కుమార్తెలు ఉన్నారు. మొత్తంమీద 1,200 మంది సభ్యులున్న ఈ కుటుంబంలో దాదాపు 350 మంది ఓట్లు వేయనున్నారు. సోనిత్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి తొలి విడతలో పోలింగ్ జరగనుంది. ఈనెల 19న రాన్ బహదూర్ థాపా కుటుంబంలోని 350 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు. సాధారణంగా 300 నుంచి 700 మంది ఓటర్లకు ఓ పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తుంటారు. అదే నగరాల్లో అయితే వెయ్యి మందికి ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తారు. ఈ కుటుంబం కోసమే ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు.

ఇద్దరు కుకీల మృతిపై జీరో ఎఫ్ఐఆర్

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతోంది. కాంగ్‌పోక్పీ జిల్లా సరిహద్దుల్లో శనివారం ఉదయం మెయితీలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు కుకీ వలంటీర్లు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆ మృతదేహాలను ఛిద్రం చేసినట్లు కుకీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇద్దరు కుకీ వలంటీర్ల మృతిపై కాంగ్‌పోక్పీ పోలీస్ స్టేషన్‌లో రెండు జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు మణిపూర్ పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం సెక్షన్ 16, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం సెక్షన్ మూడు, ఐపీసీలోని హత్య, నేరపూరిత కుట్ర, అల్లర్లు, బెదిరింపులు, సంబంధిత నేరాలు, ఆయుధ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మృతులను కాంగ్‌పోక్పీ జిల్లాలోని కె. సాజాగ్ గ్రామానికి చెందిన కమ్మిన్‌లాల్ లుఫెంగ్ (23), బాంగ్‌జాంగ్ గ్రామానికి చెందిన కామ్లెన్‌సాత్ లుంకిమ్ (25)లుగా గుర్తించారు. వారి మృతిపై ఆరంబై తెంగోల్ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మణిపూర్ అల్లర్లపై దత్తా పదస్లాగికర్ డీజీపీ (రిటైర్డ్) నేతృత్వంలో సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీకి మణిపూర్ ట్రైబల్స్ ఫోరమ్ ఢిల్లీ (ఎంటీఎఫ్‌డీ) లేఖ రాసింది. లుఫెంగ్, లుంకిమ్‌లను అత్యంత క్రూరంగా వారి పాదాలను తాళ్లతో కట్టి కొండపైకి లాగారని, హత్య చేసిన తర్వాత మృతదేహాలను కొడవలితో ముక్కలుగా నరికి ఊరేగించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరలయ్యాయని పేర్కొన్నారు.

రూపాలా వద్దే వద్దు

బీజేపీకి రాజ్‌పుత్‌ల హెచ్చరిక

గాంధీనగర్ (గుజరాత్): గుజరాత్‌లోని రాజ్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గంలో పురుషోత్తం రూపాలా అభ్యర్థిత్వం బీజేపీకి తలనొప్పిగా మారింది. రాజ్‌కోట్‌లో బీజేపీ అభ్యర్థి పురుషోత్తం రూపాలాను తప్పించకపోతే పెద్దఎత్తున నిరసన తెలుపుతామని, రూపాలాను ఓడిస్తామని రాజ్‌పుత్‌లు హెచ్చరించారు. గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాల్లో తమ నిరసనలు తీవ్రతరం చేస్తామంటున్నారు. ఈ నెల 19 లోగా పురుషోత్తం రూపాలాను అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించకపోతే తమ నిరసన దేశంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని రాజ్‌పుత్ సంకల్ప్ సమితి చైర్మన్ కరన్‌సిన్హ చద్వా తెగేసి చెప్పారు. ఈ సమితి రాజ్‌కోట్‌లో 'రాజ్‌పుత్ ఆత్మగౌరవ సభ' నిర్వహించింది. ఈ నెల 16న రూపాలా నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంతో ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది. నామినేషన్‌కు చివరి తేదీ 19, ఉపసంహరణ తేదీ 22 వరకు ఉంది. పటీదార్ సామాజిక వర్గానికి చెందిన రూపాలా మార్చి 22న వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. పూర్వపు మహారాజులు, బ్రిటిష్ వారితో సహా విదేశీ పాలకుల అణచివేతకు లొంగిపోయారు. అదీకాక వారితో కలిసి భోజనం చేసి మహారాజులు తమ కుమార్తెలను విదేశీయులకు ఇచ్చి వివాహం జరిపించారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాజ్‌పుత్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిరసనలు తెలిపారు. రూపాలా అభ్యర్థిత్వాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీని డిమాండ్ చేశారు. రూపాలా ఇప్పటికే రెండుసార్లు క్షమాపణలు చెప్పినా రాజ్‌పుత్ వర్గాలు నిరాకరించాయి. ఈ నేపథ్యంలో రూపాలాకు వ్యతిరేకంగా గుజరాత్ మొత్తం పోస్టర్లు వెలిశాయి. గుజరాత్‌లో మొత్తం 26 స్థానాలకు మే ఏడున పోలింగ్ జరగనుంది. రూపాలా అభ్యర్థిత్వాన్ని మార్చకపోతే... వందల సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసి బీజేపీ అభ్యర్థిని ఓడిస్తామని హెచ్చరించారు. 'బీజేపీలో విభేదాలు తలెత్తితే... రాత్రికిరాత్రే మంత్రులు, సీఎంను తొలగిస్తారు. కానీ, బీజేపీ నేత రాజ్‌పుత్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఎందుకు నిశ్శబ్దంగా ఉంటుంది? మేము పెద్ద ఎత్తున పోరాడుతాం. సమస్యలపై మేము ధైర్యం చూపిస్తాం' అని రాత్‌పుత్‌ల నేత తృప్తి బా తెలిపారు. మరోవైపు కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసమే నిరసనలకు ఆజ్యం పోస్తున్నారని బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనీశ్ దోషి స్పందిస్తూ 'మేము చాలా విశ్వాసంతో ఉన్నాం. పటీదార్, రాజ్‌పుత్‌లు అంతా కలిసి రూపాలాను ఓడిస్తారు' అని అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి పరేశ్ ధమాని పోటీ చేస్తున్నారు.

జంగాల, జొన్నాకు బ్రహ్మరథం

మంగళగిరి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని కుంచనపల్లిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమాన్ని సీపీఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య జండా ఊపి ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్‌కే సలీం, సీపీఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు అభ్యర్థులకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పలికారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బలపరిచిన ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నరేంద్ర మోదీని ఇంటికి సాగనంపే సమయం వచ్చిం దని, ప్రజలందరూ ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. మోదీ వచ్చిన తర్వాత రైతులు వ్యవసాయం చేయలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. పరిశ్రమలు మూత పడ్డాయని, దేశంలో ఉన్న బ్యాంకులన్నింటినీ గుజరాత్‌కు చెందిన 27 మంది లూటీ చేశారని, అందులో కొంత మంది విదేశాలకు పారిపోయారని చెప్పారు. కొంతమంది స్వదేశంలోనే మోదీ సంరక్షణలో ఉన్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల నేతలను జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ సర్కారు కుట్ర చేస్తోందన్నారు. విజ్ఞులైన ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా తనకు కంకి కొడవలి గుర్తుపైన, మంగళగిరి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్‌కి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జొన్న శివశంకర్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. తాడేపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కృష్ణానది పక్కనే ఉన్నా తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను మీద భారాలు పెంచారని, కనీసం పరిష్కార మార్గం చూపడం లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో సీపీఎం, సీపీఐ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాయన్నారు. పేదల హృదయాల్లో కమ్యూనిస్టులు ఉన్నారని, ఇండియా కూటమి కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేయాలని అన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ దేశంలో ఎన్నికల బాండ్లు అతి పెద్ద కుంభకోణమన్నారు. షేక్ సలీం మాట్లాడుతూ మోదీ హయాంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. మోదీ గద్దెనెక్కి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేశారని అన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వామపక్షాలను ఆదరించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు జిల్లా నాయకులు బి.ముత్యాలరావు, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి మండల నాయకులు పటాన్ సుభాని, రేమిడిశెట్టి హనుమంతరావు, సీపీఐ నాయకులు కొల్లి రంగారెడ్డి, మేడా హనుమంతరావు, జంగాల చైతన్య, ఆకిటి అరుణ్ కుమార్, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, ముసునూర్ సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ దాంగే, కాశిం, సింగంశెట్టి రవికిషోర్, సీపీఎం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, కంచర్ల సాంబశివరావు, సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు బి.శివారెడ్డి, బి.దశరథరెడ్డి, గోపిరెడ్డి, ఆరుమళ్ల నాగిరెడ్డి, సీపీఎం కుంచనపల్లి గ్రామ నాయకులు కాజా సురేష్, అమ్మిశెట్టి రామారావు, గోపాలం శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామ కేసు దర్యాప్తుపై స్టే ఎత్తేయండి

సుప్రీంను కోరిన సీబీఐ

న్యూదిల్లీ: వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజుపై సీబీఐ దృష్టి సారించింది. ఆయన కేసులు విచారించ డానికి ముందుకు వచ్చింది. అందులో భాగంగా బ్యాంకులను మోసగించిన కేసులో రఘురామకృష్ణరాజు దర్యాప్తుపై స్టే ఎత్తేయాలని సుప్రీం కోర్టుకు సీబీఐ విన్నవించింది. బ్యాంకులకు రుణం ఎగవేతలో క్రిమినల్, సివిల్ కేసులపై దర్యాప్తు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. కాగా, రఘురామ కేసుపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీబీఐ తన వాదనలు వినిపించింది. రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... నాన్ మిసిలేనియస్ రోజుల్లో విచారణ జరిపాలని కోరారు. దీంతో, కేసు తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది. రఘురామకృష్ణరాజు థర్మల్ పవర్ కంపెనీ స్థాపిస్తామని బ్యాంకుల నుంచి రూ.974 కోట్లు రుణం తీసుకున్నారు. ఇన్డ్-భారత్ కంపెనీ పేరుతో బ్యాంకుల నుంచి రుణం పొందిన రఘురామకృష్ణ రాజు...ఆ డబ్బును కంపెనీ కోసం ఖర్చు చేయకుండా ఇతర బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లను తనఖా పెట్టి మళ్లీ రుణం తీసుకున్నారు. ఈ రుణాన్ని దారిమళ్లించడంతో సీబీఐ కేసు నమోదు చేసింది. బ్యాంకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ 120బీ, 420, 467, 468, 471 సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీనిపైనే దర్యాప్తు కొనసాగుతోంది.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు చర్యలు

సమన్వయ సమావేశంలో ఏపీ, తెలంగాణ సీఎస్‌లు

విశాలాంధ్ర-విజయవాడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పని చేయాలని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో అంతర్ రాష్ట్ర ఎన్నికల సంబంధిత అంశాలపై రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు డా.కె.ఎస్.జవహర్ రెడ్డి, శాంతి కుమారి అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ స్థానాలకు మే 13న ఒకేసారి ఎన్నికలు జరగనున్నందున ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించేందుకు తెలంగాణతో కలిసి పూర్తి స్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధానికి 'ఆపరేషన్ పరివర్తన' పేరిట చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌తో ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో వివిధ శాఖల ద్వారా 129 పైగా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమ మద్యం రవాణా, డబ్బు పంపిణీ, వివిధ వస్తువుల రవాణాను నియంత్రించేందుకు ఈ చెక్ పోస్టులు ద్వారా పటిష్టమైన నిఘా చర్యలు చేపట్టామన్నారు. రెండు రాష్ట్రాల ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాలు మంచి సమన్వయంతో పని చేస్తున్నాయని జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ మే 13 న జరిగే పోలింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిస్థితి కూడా పూర్తిగా అదుపులో ఉందని, ఇదేరకమైన వాతావరణాన్ని పోలింగ్ పూర్తయ్యే వరకు మరింత పకడ్బందీగా కొనసాగేలా ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయి సమావేశం దోహద పడుతుందన్నారు. గోవా, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రాష్ట్రంలోకి అక్రమంగా రవాణా కాకుండా ఆయా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్ పోస్టులలో మరింత అప్రమత్తత అవసరమన్నారు. ఇప్పటికే తెలంగాణా ప్రభుత్వం పోలీసు శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్ పోస్టులు, అటవీ శాఖకు సంబంధించి మూడు అంతరాష్ట్ర చెక్ పోస్టులు, ఎక్సయిజ్ శాఖ ద్వారా ఎనిమిది చెక్ పోస్టులు, 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, వాణిజ్య పన్నుల శాఖ ద్వారా ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలపాటు పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదని, చత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరగకుండా రెండు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర పోలీసు బలగాల మధ్య పటిష్టమైన సమన్వయంతో పని చేస్తున్నామని శాంతి కుమారి తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణా రాష్ట్ర డీజీపీ రవి గుప్త, అడిషనల్ డీజీలు శివధర్ రెడ్డి, మహేష్ భగవత్, ఏపీ అడిషనల్ డీజీ డా.శంకబ్రత బాగ్చి, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.రజత్ భార్గవ, తెలంగాణా పీసీసీఎఫ్ ఆర్ఎం.డొబ్రియెల్, ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తదితర అధికారులు హాజరయ్యారు.

ప్రత్యేక హోదా తీసుకువస్తా

- కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించండి
- పరిశ్రమలు వస్తాయి... యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి

విశాలాంధ్ర-కార్వేటినగరం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తే ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తానని, దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. కార్వేటి నగరంలో సోమవారం ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర క్రేన్ సహాయంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డి.రమేష్ బాబు, యువత అధ్వర్యంలో గజమాలతో షర్మిలారెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం గాంధ్ల మిట్ట కూడలి వద్ద రోడ్ షోలో ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఏర్పాటయ్యాక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని విమర్శించారు. యువతకు మెగా డీఎస్సీ అంటూ 23 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 6 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేస్తుందని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల ఉద్యోగాలకు తొలి సంతకం చేస్తామని షర్మిల తెలిపారు. ఇక్కడ జీడి నెల్లూరు ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మద్యం వ్యాపారంలో బాగా సంపాదించుకున్నారని, కల్తీ మద్యం తాగి చాలామంది అనారోగ్యానికి గురయ్యారని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు మద్య నిషేధం చేస్తామని చెప్పిన మాట సీఎం జగన్‌కు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న రెండు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ జీడి నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బాబును హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని షర్మిలారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుసాని గోవర్ధన్ రెడ్డి, జిల్లా ఓబీసీ చైర్మన్ రావూరి పూర్ణచంద్రరావు, రాష్ట్ర కిసాన్ సెల్‌కు చెందిన బండి సుబ్బరాయుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చందు రాణి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు దినకరప్రసాద్, నరసింహనాయుడు, ఉమేష్ రెడ్డి, తులసీమని, పుష్ప రాజ్, నాయకులు నాదముని రెడ్డి, యుగంధర్ నాయుడు, గౌతమ్ రాజు, ప్రసాద్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హోదా ఇవ్వని బీజేపీని నిలదీయండి

- రాజధాని లేకుండా చేసిన వైసీపీని ప్రశ్నించండి
- సీపీఐ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఓట్ల కోసం తమ ఇంటి వద్దకు వచ్చే బీజేపీ అభ్యర్థిని రాష్ట్రానికి ఎందుకు ప్రత్యేక హోదా ఇవ్వలేదని నిలదీయండి... రాష్ట్రానికి రాజధాని ఎందుకు లేకుండా చేశారని వైసీపీ అభ్యర్థిని ప్రశ్నించండి... నిత్యం ప్రజల మధ్య ఉండే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని గెలిపించండని ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వర రావు కోరారు. సోమవారం స్థానిక 50వ డివిజనులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సంపన్నులకు, సామాన్యుడికి మధ్యే పోటీ అని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ, తెస్తామన్న వైసీపీ రెండు పార్టీలు ప్రజలను ఘోరంగా మోసం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు రూ.కోట్లతో ఓట్లను కొనుగోలు చేసి గద్దె నెక్కాలని చూస్తున్నాయని చెప్పారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, కోటీశ్వరులకు ఓట్లు వేస్తే వారు ఢిల్లీకే పరిమిత మవుతారని... అదే నిత్యం ప్రజల మధ్య ఉండే తనకు ఓటు వేసి గెలిపిస్తే... ఇక్కడి సమస్యల పరిష్కారానికి చట్ట సభల్లో పోరాడతానని కోటేశ్వర రావు తెలిపారు. తనను గెలిపిస్తే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కొండ ప్రాంత ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయిస్తానని, ఆరేళ్ల క్రితం టిడ్కో ఇళ్ల కోసం రూ.25వేలు, రూ.50వేలు, రూ.లక్ష చొప్పున కట్టిన లబ్ధిదారులు అందరికీ ఇళ్లు కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. సీపీఎం కార్పొరేటర్ బోయ సత్యబాబు మాట్లాడుతూ ధరలు తగ్గాలన్నా.. విజయవాడ నగరం అభివృద్ధి చెందాలన్నా... కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రాజు, జి.నాగ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జీ శ్రీనివాస్, సీపీఐ కార్యదర్శి వర్గసభ్యులు తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణా రావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవింద రాజు, నాయకులు లంకే సాయి, శిరం రవి, మోహన్, క్రాంతి, అయ్యప్ప, మహిళా సమాఖ్య నేతలు కొట్టు విజయలక్ష్మి, తాడి లీల, స్థానిక నాయకులు పీ రాము, బొర్రా రామకృష్ణా, మురిగేశన్, వక్కల గడ్డ సత్యన్నారాయణ, నూనె కొండలరావు, పేకేటి రాజేష్ రాము, బల్లా నరసింహ రాజు,నుకా చిన్న, పిట్టా అప్పారావు, గాడి అప్పారావు, మోకా దుర్గ రావు, డి.రావు పితా శేఖర్, గుజ్జాల అప్పారావు, వినుకొండ శాంసన్, చేకూరి రాజేశ్వరరావు, సీహెచ్.కొండమ్మ, సీహెచ్ దుర్గారావు, ఇప్పుల రంగరావు తదితరులు పాల్గొన్నారు.

మే 25 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు మే 25వ తేదీ నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఇంటర్ మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు పేపర్లతో సంబంధం లేకుండా రూ.550, ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చొప్పున చెల్లించాలి. ఇంటర్ మొదటి సంవత్సరంలో అన్ని పేపర్లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంప్రూవ్‌మెంట్ కోసం రూ.550 పరీక్ష ఫీజుతో పాటు పేపర్‌కు రూ.160 చొప్పున చెల్లించాలి. మొదటి, రెండో సంవత్సర ఇంప్రూవ్‌మెంట్ రాసే సైన్స్ విద్యార్థులు రూ.1,440, ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,240 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల ఫీజును ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు చెల్లించాలని, అలాగే రీ కౌంటింగ్, వెరిఫికేషన్ కోసం ఇదే తేదీల్లో చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు.

ఈసారి వర్షాలు ఎక్కువే...

- జులై నాటికి దేశమంతటా రుతుపవనాలు
- భారత వాతావరణ విభాగం వెల్లడి

న్యూదిల్లీ: దేశంలో ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, లా నినా పరిస్థితులు ఆగస్టు- సెప్టెంబరు నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం తెలిపింది. అయితే వాతా వరణ మార్పుతో వర్ష వ్యవస్థను వైవిధ్యాన్ని మరింత పెంచుతుందని, దేశ వ్యాప్తంగా సాధారణ వర్షపాతం ఏకరీతిన ఉండక పోవచ్చని పేర్కొంది. వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం, వర్షపు రోజుల సంఖ్య తగ్గుతోందని, అయితే భారీ వర్షాల సంఘటనలు (తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షాలు) పెరుగుతున్నాయని, ఇది తరచుగా కరువులు, వరదలకు దారితీస్తుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) దేశం మొత్తం మీద వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) దేశం మొత్తం మీద వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది దీర్ఘకాల సగటు 104 శాతం కంటే ఎక్కువ. 1951-2023 మధ్య గణాంకాల ప్రకారం, లా నినా ఎల్‌నినో అనుసరించిన తొమ్మిది సందర్భాలలో రుతుపవన కాలంలో దేశం సాధారణం కంటే ఎక్కువ వర్షపాతాన్ని చవిచూసిందని భారత వాతావరణ శాఖ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. నాలుగు నెలల రుతుపవనాల సీజన్‌లో (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) దేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, సంచిత వర్షపాతం దీర్ఘకాల సగటు (87 సెం.మీ.)లో 106 శాతంగా అంచనా వేసినట్లు చెప్పారు. వర్షాకాలంలో అనుకూల హిందూ మహాసముద్రం ద్విధ్రువ పరిస్థితులను అంచనా వేస్తారు. అలాగే ఉత్తరార్ధగోళంలో మంచు తక్కువగా ఉంటుంది.

ఈ పరిస్థితులు భారత నైరుతి రుతుపవనాలకు అనుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఓ మోస్తరు ఎల్‌నినో పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి ఇది తటస్థంగా మారుతుందని అంచనా వేస్తున్నామని, ఆ తర్వాత ఆగస్టు-సెప్టెంబరు నాటికి లా లినా పరిస్థితులు నెలకొనవచ్చని మహాపాత్ర వివరించారు. ఈ సారి వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. జులై నాటికి దేశమంతటా రుతుపవనాలు విస్తరిస్తాయన్నారు. ఎల్ నినో సంవత్సరంలో 2023లో భారతదేశంలో 'సగటు-తక్కువ' సంచిత వర్షపాతం దీర్ఘకాల సగటు 868.6 మిమీతో పోలిస్తే 820 మిమీ పొందింది. 2023కు ముందు దేశంలో వరుసగా నాలుగు సంవత్సరాలు రుతుపవనాల సీజన్‌లో 'సాధారణ', 'సాధారణం కంటే ఎక్కువ' వర్షపాతం నమోదయింది. ఎల్ నినో పరిస్థితులు మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాల ఆవర్తన వేడెక్కడం భారత దేశంలో బలహీనమైన రుతుపవనాల గాలులు, పొడి పరిస్థితులతో సంబంధం కలిగి ఉంటాయి. నైరుతి రుతుపవనాలు భారతదేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం అందిస్తుంది. ఇది వ్యవసాయ రంగానికి కీలకం. దేశ జీడీపీలో వ్యవసాయం వాటా 14 శాతం.

జగన్ సమక్షంలో వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ పార్టీలకు చెందిన నేతలు వైసీపీలో చేరారు. కేసరపల్లి నైట్ స్టే పాయింట్ వద్ద సీఎం జగన్ సమక్షంలో నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ నేత, హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్ హుస్సేన్, టీడీపీ అధికార ప్రతినిధి ముస్తాఫా మొమిన్, కర్నూలు జిల్లా తాలిమీ బోర్డు అధ్యక్షుడు ముఫ్తీ నూర్ మహమ్మద్, మహమ్మద్ ఇలియాస్ చేరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాశ్ అధ్వర్యంలో టీడీపీకి చెందిన అనేక మంది నేతలు వైసీపీలో చేరారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 40వ వార్డు టీడీపీ నేత, ప్రొఫెషనల్ వింగ్ జోనల్ కోఆర్డినేటర్ వెలగలేటి భార్గవ రాయుడు తదితరులకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు అధ్వర్యంలో టీడీపీకి చెందిన కీలక నేతలు వైసీపీలో చేరారు.

రెండు దశాబ్దాల పాలనకు తెర

పదవి వీడనున్న సింగపూర్ ప్రధాని



సింగపూర్: ఆర్థిక సుసంపన్న దేశమైన సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ లూంగ్ ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ఆయన... మే 15న పదవి నుంచి దిగిపోనున్నట్లు ప్రకటించారు. నాయకత్వ మార్పు అనేది ఏ దేశానికైనా అత్యంత ముఖ్యమైన క్షణమని పేర్కొన్నారు. ఉప ప్రధాని లారెన్స్ వాంగ్ ఆయన స్థానాన్ని భర్తీ చేయనున్నారు. వాస్తవానికి ఆయన గతంలోనే పదవి వీడాల్సింది. అయితే కరోనా పరిస్థితులు, తదుపరి పీఎం ఎంపికలో జాప్యం కారణంగా ఆగిపోయింది. '2024లో ప్రధాని పదవి నుంచి వైదొలగాలన్న ఉద్దేశాన్ని గతేడాది నవంబరులోనే ప్రకటించాను. ఈ మేరకు మే 15న బాధ్యతల నుంచి నిష్క్రమిస్తాను. ఉప ప్రధాని లారెన్స్ వాంగ్ తదుపరి ప్రధానిగా అదేరోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. వాంగ్ ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. ముఖ్యంగా మహమ్మారి సమయంలో చాలా కష్టపడ్డారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాలకవర్గం కట్టుబడి ఉంది. సింగపూర్‌కు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేందుకు కొత్త ప్రభుత్వాధినేతతో కలిసి పనిచేయాలి' అని దేశ ప్రజలను ఉద్దేశించి లీ తెలిపారు. సింగపూర్ మొదటి ప్రధాని లీ కువాన్ యూ పెద్ద కుమారుడే లీ సీన్ లూంగ్ (72). గణితంలో దిట్ట. దేశ మూడో ప్రధానిగా 2004 ఆగస్టులో ప్రమాణస్వీకారం చేశారు. 70 ఏళ్లు దాటిన తర్వాత పదవి నుంచి దిగిపోతానని 2012లోనే ప్రకటించారు. పాలకపక్షమైన 'పీపుల్స్ యాక్షన్ పార్టీ' రాజకీయ వారసత్వంలో భాగంగా ఇదివరకటి ఉప ప్రధాని హెంగ్ స్వీ కీట్... తదుపరి పీఎం కావాల్సింది. తన వయసు (60) కారణంగా చూపుతూ 2021లో ఆయన వైదొలిగారు. ఏడాదిపాటు సుదీర్ఘ చర్చల అనంతరం ఆర్థికమంత్రి లారెన్స్ వాంగ్ (51)ను డిప్యూటీ పీఎం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

సమరాంగణం 2024

ఓటరు సోయి

-వేల్పుల నారాయణ

కలర్ ఫుల్ హామీలతో- గ్యారంటీల మాటలు
ఎన్నికల్లో కదుతున్నరు -ఎరవేసే కోటలు
ఇన్నేళ్లుగా దేశాన్ని-ఇష్టరీతి ఏలినోళ్లు
అభివృద్ధి ప్రణాళిక -అందంగా చూపినోళ్లె
అమలు చేసే చిత్తశుద్ధి -అసలు లేనే లేనోళ్లు
సోయితప్పి గెలిపిస్తే- చింతించుడే ఐదేళ్లు ?కలర్?
ప్రతి సారి ఎన్నికల-మ్యానిఫేస్టో ప్రకటిస్తరు
ఆకర్షించే హామీలతో-అందరికీ పంచేస్తరు
సింగిడిలా గెలుపువరకే-చెమక్ చెమక్ మెరిపిస్తరు
ఆపైనా అందకుండా-అల్మారాల్లో దాచేస్తరు

వికసించని అభివృద్ధిని-విస్తృతంగా చాటేస్తరు
అరచేతిలో వైకుంఠం-అద్భుతంగా చూపిస్తరు
ఇంద్రజాల ప్రదర్శన-ఇష్టరీతి మురిపిస్తారు
కులం మతం డబ్బు తోని-కౌగిలించి వాటేస్తరు?కలర్?

నక్కి నక్కి నాచుబెట్టి-నిజంగానే బోర్లేస్తరు
నమ్మి వాళ్ల గెలిపిస్తే-నిప్పులపై బోర్లిస్తరు
కళ్లముందే మాయ భ్రమల-కాంతి తెరలు కప్పేస్తరు
మోసపోయి చిక్కుకుంటె-మొత్తానికే ముంచేస్తరు ॥కలర్॥
అన్ని నేడు ఓట్లకొరకు -అబద్దాల విచిత్రాలే
ఎన్నికల ప్రచారాల్లో -ఎన్నెన్నో సచిత్రాలే
ఎవరేమిటో ఇన్నేళ్లు-ఎరుకలేదా అందరికి
సందిగ్ధం ఎందుకింకా-సాగరాదా ముందరికి ॥కలర్॥

అడుగడుగున నేరస్థులు-అవినీతి స్వార్థపరులు
అందరిని పీడించి-అణగదొక్కె బలవంతులు
దేశంలో కొదవలేరు-దేశ సేవ గుణవంతులు
మరిదేనికి ఎన్నికల్లో-మనలదోచే ధనవంతులు ॥కలర్॥

వ్యక్తి కేంద్ర రాజకీయ-వ్యవస్థీకృత పరిపాలన
ప్రమాదమే చేయకుంటె-ప్రజలు ఇంకా ప్రక్షాళన
రాజరికం మరో రూపే-రాజ్యమేలుతుంటది
ప్రజాస్వామ్య నిర్మాణం-పగిలి కూలుతుంటది ॥కలర్॥

ప్రశ్నలకు మోదీ దూరం

పదిహేడవ లోక్‌సభ అనేక రికార్డులు సృష్టించింది. 1952 నుంచి ఇప్పటి వరకు తక్కువ రోజులు పని చేసిన లోక్‌సభ ఇదే. గత అయిదేళ్ల కాలంలో ప్రధానమంత్రి మోదీ సభలో ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదు. గత పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉంటే అందులో ఏడేళ్ల 267వ నిబంధన కింద ప్రతిపక్షాలు ఇచ్చిన ఒక్క నోటీసును కూడా చర్చకు స్వీకరించలేదు. అధికార పక్ష సభ్యుడు మతోద్రేకాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన లోక్‌సభ కూడా ఇదే. 17వ లోక్‌సభ ఆఖరి సమావేశంలో దక్షిణ ఢిల్లీ నుంచి ఎన్నికైన రమేశ్ బిధూరీ ముస్లింలకు వ్యతిరేకంగా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అమ్రోహా నుంచి ఎన్నికైన బీఎస్‌పీ ఎంపీ దానిశ్ అలీని ఉద్దేశించి బిధూరీ అనరాని మాటలన్నారు. స్పీకర్ బిధూరీ మీద ఏ చర్యా తీసుకోకుండా హెచ్చరించి వదిలేశారు. బిధూరీ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించి సరిపెట్టారు. బీజేపీ కూడా బిధూరీకి నోటీసు జారీ చేసింది.
చంద్రయాన్ -3 ప్రయోగంపై చర్చ సందర్భంగా బిధూరీ ప్రసంగంలోని కొన్ని భాగాలపై దానిశ్ అలీతో సహా కొందరు ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పుడు బిధూరీ ముస్లింలను కించపరుస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సభ్యుడు డా. హర్ష వర్ధన్ పుండు మీద కారం చల్లినట్టుగా చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నారు. 17వ లోక్‌సభ చివరి సమావేశంలోనే ముగ్గురు నలుగురు యువకులు భద్రతా వలయం కళ్లుగప్పి సందర్శకుల గ్యాలరీలో చేరి నినాదాలు చేశారు. వారికి దురుద్దేశం లేకపోయినా, కేవలం తమ సమస్యలను సభ దృష్టికి తీసుకురావడానికే ఇలా చేసినా పార్లమెంటు భద్రతకు తీవ్ర విఘాతం కలిగించడమే. ఇంతకు ముందు వాజపేయి ప్రభుత్వ హయాంలో లాల్ కృష్ణ అద్వాణీ హోం మంత్రిగా ఉన్నప్పుడు తీవ్రవాదులు భద్రత దళాల వారి మీద కాల్పులు జరిపారు. ఆ తీవ్రవాదులందరినీ భద్రతా దళాల వారు కాల్చి వేసినా పార్లమెంటుకు భద్రత కల్పించడంలో వైఫల్యం చర్చనీయాంశమైంది. ఇలా భద్రతకు విఘాతం కలిగిన అంశంపై చర్చ జరగాలని కోరిన 146 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. ఇంత భారీ సంఖ్యలో సభ్యులను ఒకే సారి సస్పెండ్ చేయడం ఇదే మొదటి సారి. ప్రతిపక్ష సభ్యులు అడిగిన 300 ప్రశ్నలను అనుమతించకపోగా రికార్డుల్లో వాటి ఆనవాలే లేకుండా చేశారు.

హాస్య స్ఫోరక సంఘటనలు

ప్రతికూల అంశాలు చాలానే ఉన్నప్పటికీ 17వ లోక్‌సభలో నవ్వు తెప్పించే అంశాలు కూడా ఉన్నాయి. పార్లమెంటు కొత్త భవనంలో సభ్యుల హాజరీ వారి ముఖాన్ని గుర్తించి నమోదు అవుతుంది. సభా ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ద్వారం వద్ద కాసేపు ఆగి తమ ముఖం నమోదయ్యేలా చూడాలి కనక ఆ సమయంలో సభ్యులందరూ నవ్వు ముఖాలతో కనిపిస్తారు. పార్లమెంటు కొత్త భవనంలో పాత భవనంలోలాగా సెంట్రల్ హాలు ఏదీ లేదు. అంటే పెద్ద సంఖ్యలో సభ్యులు ఒక చోట చేరే వీలు ఉండదు. లోక్‌సభ, రాజ్యసభకు కొత్త భవనంలో విడివిడిగా రెండు క్యాంటీన్లు ఉన్నాయి. ఒకటి లోక్‌సభకు చేరువగా, రెండవది రాజ్యసభ దగ్గర్లో ఉన్నాయి. ఒక సభలో సభ్యులైన వారు మరో సభకు చెందిన క్యాంటీన్‌కు వెళ్తే వారిని ప్రత్యేక అతిథులుగా చూస్తున్నారు. విశిష్ట అతిథులు కనక వారిని బిల్లు చెల్లించమని కూడా అడగరేమో.

పార్లమెంటు క్యాంటీన్లలో మాంసం, చేపలు, కోడి మాంసం బిర్యానీలు సరసమైన ధరకే అందుబాటులో ఉంటాయి. చేపల వేపుడు మొన్నటి దాకా అంతగా ఆరోగ్యకరం కాని బసా చేపలతో చేసేవారు. సభ్యులు అనేక సార్లు విజ్ఞప్తి చేసిన తరవాత ఇక మీదట భెక్తి చేపల వేపుడు చేయడానికి అంగీకరించారు.
పార్లమెంటు కొత్త భవనానికి ఆరు ద్వారాలు ఉన్నాయి. ఆ గేట్ల పేర్లు పురాణాలను గుర్తు చేసేలా ఉన్నాయి. గజద్వారం, అశ్వద్వారం, గరుడ ద్వారం, మకర ద్వారం, శార్దూల ద్వారం, హంస ద్వారం లాంటి పేర్లు పెట్టారు. కానీ దక్షిణాదికి, తూర్పు ప్రాంతానికి చెందిన ఎంపీలు ఈ పేర్లు ఉచ్చరించడానికి ఇబ్బంది పడుతున్నారు.

మీడియా నిషేధం

పార్లమెంటు నూతన భవనాన్ని సాధ్యమైనంత ఆకర్షణీయంగా నిర్మించామంటున్నా అక్కడ మీడియాకు చోటు లేదు. పార్లమెంటులో జరిగిన అంశాల గురించి మీడియా తెలుసుకోవాలంటే ఎంపీలను ఆశ్రయించి వారిచ్చే సమాచారం ఆధారంగా వార్తలు రాయాల్సిందే. మీడియాకు ఓ గది ఉన్న మాట నిజమే. కానీ అది సభా కార్యకలాపాలు జరుగుతున్న చోటికి అల్లంత దూరంలో ఉంటుంది. పార్లమెంటు భవనం కొత్తదే అయినా మీడియాను దూరం పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య సూత్రాలకు తిలోదకాలిచ్చారు. కొత్త భవనంలోకి ఎంపీల ప్రైవేటు సహాయకులను అనుమతించరు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తక్కువైన ఎంపీలు సహాయకులు లేక ఇబ్బంది పడవలసి వస్తోంది. మీడియానే దూరంగా పెట్టినప్పుడు ప్రైవేటు సహాయకులను ఎందుకు అనుమతించడం లేదన్న తర్కం సరైందే అయినా సమాధానం ఇచ్చేవారే లేరు.

ఎన్నికల గుర్తుల కథ

దేశంలో ఎన్నికల సమరాంగణం మొదలైంది. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తమకు ఓటేయాలని ప్రజలను కోరుతున్నారు. అయితే ఎన్నికల్లో పార్టీలను సులువుగా గుర్తించి ఓటు వేసేందుకు వాటి గుర్తులు ఎంతగానో దోహదమవుతాయి. అసలు ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలు గుర్తులను వినియోగించడం ఎప్పటి నుంచి మొదలు పెట్టాయి... వాటి కథేమిటో తెలుసుకుందాం.

తొలిసారి పార్లమెంటరీ ఎన్నికలు జరిగినప్పుడు దేశంలో అక్షరాస్యత 16శాతం మాత్రమే ఉన్నది. ఎన్నికలు జరిగినప్పుడు పోటీ చేసే పార్టీలను సామాన్య ప్రజలు సులువుగా ఎలా గుర్తిస్తారన్న ప్రశ్న అప్పట్లో రాగా అందుకు ప్రత్యక్ష పరిష్కారంగా గుర్తు తెరపైకొచ్చింది. అక్కడ నుంచి ఎన్నికల్లో పార్టీల గుర్తుల వినియోగం మొదలైంది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. అక్షరాస్యత పెరిగినప్పటికీ గుర్తుల ద్వారా పార్టీలను గుర్తించే పద్ధతి ఆచరణలో ఉన్నది.

చిత్రకారుడు ఎంఎస్ సేథి

ఎన్నికల గుర్తులకు రూపమిచ్చిన చిత్రకారుడు ఎంఎస్ సేథి. 1950లో బ్యాలెట్ కమిటీ ఆయనను నియమించింది. 1992లో ఆయన పదవీ విరమణ పొందేంత వరకు అంటే 40 ఏళ్ల పాటు ఆయన హెచ్‌పీ పెన్సిల్, కాగితం పట్టుకొని ఎన్నో పార్టీల కోసం గుర్తులు చిత్రీకరించారు. రోజువారీ జీవితాలతో ముడిపడే వాటిని ఎన్నికల గుర్తుగా గీశారు. 2000లో సేథి కన్నుమూశారు కానీ ఆయన చిత్రాలు నేటికీ ఎన్నికల గుర్తులుగా వినియోగమవుతున్నాయి. అయితే అవి కాలక్రమేణ ఆధునికతను సంతరించుకున్నాయి.

కాంగ్రెస్ తొలి గుర్తు 'జోడెద్దులు'

కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటి ఎన్నికల గుర్తు 'జోడెద్దులు. 1951 నుంచి 1969 వరకు ఇదే గుర్తులో కాంగ్రెస్ పోటీ చేసింది. ఆ తర్వాత 'ఆవు-దూడ' గుర్తు వినియోగమైంది. 1977లో మాత్రమే 'హస్తం' గుర్తు వినియోగంలోకి వచ్చింది. జనసంఘ్ పార్టీకి ఎన్నికల గుర్తుగా 'దీపం' ఉండేది. ఆపై నాగలి పట్టిన మనిషి బొమ్మను వాడారు. అనంతరం కమలం గుర్తును బీజేపీ ఎంపిక చేసుకున్నది. నేడు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వినియోగించే చీపురు గుర్తును 2012 అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నైతిక్ పార్టీ (యూపీఎన్పీ) వినియోగించింది. అయితే యూపీఎన్పీ కంటే ఓటర్లు ఎక్కువ ఉండటంతో ఆ గుర్తు 2014లో ఆప్‌కు దక్కింది.

జంతువుల గుర్తులపై నిషేధం

జంతువుల బొమ్మలను ఎన్నికల గుర్తులుగా వినియోగించడంపై నిషేధం ఉంది. ఏనుగు (బీఎస్పీ), సింహం (మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ), కోడిపుంజు (నాగా పీపుల్స్ ఫ్రంట్) మినహా మిగతా ఏ జంతువు బొమ్మను ఎన్నికల గుర్తుగా వాడేందుకు అనుమతిలేదు. గతంలో జంతువుల బొమ్మలను ఎన్నికల గుర్తులుగా కేటాయించడం వల్ల ఆ మూగజీవాలు వేధింపులకు గురి కావాల్సి రావడం విమర్శలకు దారితీసింది. ప్రచార ర్యాలీల్లో మూగజీవాల ఊరేగించడంపై వ్యతిరేక వచ్చింది. దీంతో వాటి బొమ్మలను ఎన్నికల గుర్తులగా వినియోగించడాన్ని ఎన్నికల సంఘం నిషేధించింది.

కేటాయింపు ఇలా

రాజకీయ పార్టీల హోదాను బట్టి ఎన్నికల గుర్తును ఈసీ కేటాయిస్తుంది. 1951 నాటి ప్రజా ప్రతినిధుల చట్టం కింద నమోదైనవి జాతీయ పార్టీలకు ఎన్నికల గుర్తుల ఆర్డర్-1968 కింద ఈసీ గుర్తింపు లభిస్తుంది. వీటికోసం కొన్ని గుర్తులను రిజర్వు చేస్తారు. ఆ పార్టీల అభ్యర్థులు ఇతర ఏ గుర్తునైనా ఎంపిక చేసుకోవచ్చు. అలాగే, ప్రాంతీయ పార్టీలకూ కొన్ని రిజర్వుడ్ గుర్తులు ఉంటాయి. అయితే అవి ఆ రాష్ట్రాలకే పరిమితం. ఇతర రాష్ట్రాల్లో పోటీకి అదే గుర్తు కోసం సంబంధిత పార్టీలు ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా గుర్తులు అందుబాటులో ఉంటేగనుక ఈసీ వాటిని కేటాయిస్తుంది. కాగా, గుర్తింపులేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేస్తేందుగాను మూడు గుర్తులను ఎంపిక చేసుకొని వాటి కోసం దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న గుర్తుల్లో ఏదో ఒకటి ఈసీ కేటాయిస్తుంది. చాలా రాష్ట్రాల్లో ఒకటే గుర్తు కావాలన్నా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అది అందుబాటులో ఉంటే మాత్రమే ఈసీ దానిని కేటాయిస్తుంది. ఇక స్వతంత్ర అభ్యర్థులకైతే గుర్తింపు లేని పార్టీల తరహానే గుర్తుల ఎంపికకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఏదేని పార్టీతో పాటు స్వతంత్ర అభ్యర్థి ఒకటే గుర్తు కోసం దరఖాస్తు చేసుకున్న పక్షంలో దానిని పార్టీకే కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మవెలిక్కర, అలప్పుజాలో ఎల్డీఎఫ్ ప్రచారం

అలప్పుజా: కేరళలో ఎల్డీఎఫ్ ప్రచార హోరు కొనసాగుతోంది. మవెలిక్కర లోక్‌సభ స్థానం నుంచి గెలుపే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థి అరుణ్ కుమార్ ప్రచారంలో దూసుకెళుతున్నారు. రోడ్‌షోలు, బహిరంగ సభలు, సమావేశాలతో ఎన్నికల వేడిని పెంచుతున్నారు. ప్రార్థనా మందిరాలు సందర్శిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అటు సీపీఎం నేత ఏఎం ఆరిఫ్ కూడా ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. కుట్టానాడ్ సహా చట్టుపక్కల ప్రాంతాల్లో అరుణ్ కుమార్ పర్యటించగా కయంకులంలో ఆరిఫ్ ప్రచారం చేశారు. మవెలిక్కర నుంచి 2019లో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి చిట్టాయం గోపకుమార్ 61,138 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి కొడికునీల్ సురేశ్ చేతిలో ఓటమి పాలయ్యారు. అలప్పుజాలో 10,474 ఓట్లతో ఆరిఫ్ విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఒక్క అలప్పుజాలో మాత్రమే ఎల్డీఎఫ్ గెలిచింది. కానీ ఈసారి మవెలిక్కరలో అరుణ పతాకాన్ని ఎగురవేయాలన్న సంకల్పంతో అరుణ్ కుమార్ ప్రచారాన్ని సాగిస్తున్నారు.

ప్రచారంలో అరుణ్ కుమార్

సీపీఐ అభ్యర్థి పేరు తప్పుగా ముద్రణ

అలప్పుజా కలెక్టరేట్ వద్ద ధర్నా

అలప్పుజా: కేరళ, మవెలిక్కర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఎల్డీఎఫ్ అభ్యర్థి పేరును బ్యాలెట్ పేపర్‌లో తప్పుగా ప్రచురించడంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరసన వ్యక్తం చేసింది. అలప్పుజా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అఫిడవిట్‌లో 'ఏడీవీ సీఏ అరుణ్ కుమార్' అని పేర్కొంటే బ్యాలెట్‌పై 'ఏడీవీ అరుణ్ కుమార్ సీఏ' అని ఎలా ముద్రిస్తారని సీపీఐ మాజీ ఎంపీ, జిల్లా కార్యదర్శి టీజే అంజాలోసె ప్రశ్నించారు. మిగిలిన అభ్యర్థుల పేర్లు అఫిడవిట్లలో ఉన్నట్టే ఉన్నాయన్నారు. బ్యాలెట్‌పై పేరు తప్పుగా ముద్రించడాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. సత్వరమే దిద్దుబాటు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. మవెలిక్కర స్థానం నుంచి యువ నేత సీఏ అరుణ్ కుమార్‌ను సీపీఐ రంగంలోకి దించింది. అరుణ్... ఏఐవైఎఫ్ నాయకుడు, వ్యవసాయ మంత్రి పి.ప్రసాదకు అదనపు వ్యక్తిగత కార్యదర్శి. రెండు దశాబ్దాలుగా ఈ స్థానంలో సీపీఐ గెలవలేదు కానీ తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్‌ను ఓడించగలమన్న నమ్మకం అగ్రనాయకత్వంలో బలంగా ఉంది. నియోజకవర్గ ప్రజలు కూడా యువ ఎంపీ కావాలని కోరుకుంటున్నారు. దీంతో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య రసవత్తర పోరు సాగబోతోంది.

ఎల్డీఎఫ్ 2004లో ఇక్కడ నుంచి గెలిచింది. మవెలిక్కర నియోజకవర్గం మూడు జిల్లాలైన అలప్పుజా, కొట్టాయం, కొల్లంతో కూడుకొని ఉన్నది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఛంగనస్సెరి (కొట్టాయం జిల్లా), కుట్టానాడ్, మవెలిక్కర, చెంగనూర్ (అలప్పుజా), కున్నాతుర్, పథానపురం, కొట్టరక్కర (కొల్లం) ఉన్నాయి.

అదూర్ లోక్‌సభ నియోజకవర్గాన్ని రద్దు చేయడంతో ఈ స్థానం ఎస్సీ రిజర్వుడ్ సీటుగా మారింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో వామపక్ష కూటమి గెలవడంతో ఎల్డీఎఫ్‌కు ఈసారి గెలుపు అవకాశాలు పెరిగాయి.

భీమవరం పోరు రసవత్తరం



గ్రంధి వర్సెస్ పులపర్తి

పాత అభ్యర్థుల మధ్యే పోటీ

గ్రంధి శ్రీనివాస్

పులపర్తి రామాంజనేయులు

స్వాతంత్రోద్యమంలో రెండో బార్డోలిగా ఖ్యాతి గాంచిన భీమవరం రాష్ట్ర రాజకీయాల్లో ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. అప్పట్లో వరి సేద్యం, రైస్ మిల్లింగ్ రంగాల్లో గుర్తింపు పొంది ప్రస్తుతం విద్యా, వైద్య, ఆక్వా హబ్‌గా రాణిస్తున్న ఈ నియోజకవర్గంలో రసవత్తర పోరుకు నేడు తెరలేచింది. నియోజకవర్గ జనాభా 3,32,760. వీరిలో మహిళలు 1,67,080, పురుషులు 1,65,674. కాగా మార్చి 31వ తేదీ లెక్కల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,51,065 ఓటర్లు ఉన్నారు. అందులో 1,21,844 పురుషులు, 1,29,172 మహిళా ఓటర్లు, ట్రాన్స్ జెండర్స్ ఓట్లు 49 ఉన్నాయి. ప్రస్తుతం వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు జనసేన తరపున కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచారు. గ్రంధి శ్రీనివాస్ 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పి.వి.నరసింహరాజుపై 7,905 మెజారిటీతో గెలుపొంది అసెంబ్లీలో తొలిసారి అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో గ్రంధి 63,939 ఓట్లు సాధించగా, పి.వి.నరసింహరాజు 56,034 ఓట్లు పొంది ఓటమి చెందారు. 2009 ఎన్నికల్లో నాటి పరిణామాల నేపథ్యంలో గ్రంధి కాంగ్రెస్ టికెట్ కోల్పోగా అనూహ్యంగా పులపర్తి రామాంజనేయులు టికెట్ దక్కించుకుని 63,862 ఓట్లు కైవసం చేసుకుని తన సమీప ప్రజారాజ్యం అభ్యర్థి కనకరాజు సూరిపై 22,100 మెజారిటీతో గెలుపొంది అసెంబ్లీలో తొలిసారి అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో కనకరాజు 41,763 ఓట్లతో ఓటమి చెందారు. రాష్ట్ర విభజన పరిణామాల నేపథ్యంలో 2014లో జరిగిన ఎన్నికల్లో పులపర్తి రామాంజనేయులు టీడీపీ తరపున పోటీ చేసి తన సమీప వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై 13,676 మెజారిటీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో పులపర్తి 90,772 ఓట్లు సాధించగా, గ్రంధి 77,046 ఓట్లు పొంది ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో జరిగిన త్రిముఖ పోరులో గ్రంధి శ్రీనివాస్ 70,642 ఓట్లు సాధించి జనసేనాని పవన్ కల్యాణ్ పై 8,357 మెజారిటీతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ 62,285 రెండో స్థానంలోను, టీడీపీ తరపున పులపర్తి రామాంజనేయులు 54,037 ఓట్లు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.

ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 1952లో భూపతిరాజు సుబ్బరాజు ప్రజాపార్టీ తరపున తలపడి జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.సంగయ్యపై గెలుపొందారు. 1955లో నాచు వెంకట్రామయ్య జాతీయ కాంగ్రెస్ తరపున పోటీ చేసి 26,610 ఓట్లు సాధించి సీపీఐ అభ్యర్థి యాళ్లబండి పోలిశెట్టి (23,389)పై గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ నాచు వెంకట్రామయ్య జాతీయ కాంగ్రెస్ తరపున పోటీ 25,694 ఓట్లు సాదించి సీపీఐ అభ్యర్థి యాళ్లబండి పోలిశెట్టి (22,309)పై రెండోసారి గెలుపొందారు. 1967 ఎన్నికల్లో భూపతిరాజు విజయకుమార్ రాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 31,839 ఓట్లు సాదించి జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి నాచు వెంకట్రామయ్య (22,632)పై గెలుపొందారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన భూపతిరాజు విజయకుమార్ రాజు 31,091 ఓట్లు సాధించి స్వతంత్ర అభ్యర్థి యరకరాజు వెంకటరాజు (27,077)పై గెలుపొందారు. 1978లో కలిదిండి విజయనరసింహరాజు కాంగ్రెస్(ఐ) తరపున పోటీ చేసి 41,295 ఓట్లు సాధించి జనతా పార్టీ అభ్యర్థి మెంటే పద్మనాభం (26,065)పై విజయం సాదించారు. 1983 ఎన్నికల్లో పి.వి.నరసింహరాజు టీడీపీ తరపున పోటీ చేసి 61,765 ఓట్లు సాధించి కాంగ్రెస్(ఐ) అభ్యర్థి వేగిరాజు రామకృష్ణంరాజు (26,577)పై విజయం సాధించారు. 1985లో టీడీపీ అభ్యర్థి పి.వి.నరసింహరాజు 58,020 ఓట్లు సాధించి కాంగ్రెస్(ఐ) అభ్యర్థి బంద నాగవెంకటేశ్వరరావు (25,205)పై విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థి అల్లూరి సుబాసుచంద్రబోస్ 53,499 ఓట్లు సాధించి టీడీపీ అభ్యర్థి పి.వి.నరసింహరాజు (50,125)పై గెలుపొందారు. 1994లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థి భూపతిరాజు విజయకుమార్ రాజు ఆకస్మికంగా మృతి చెదడంతో ఎన్నిక జరగలేదు. అనంతరం 1995లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పి.వి.నరసింహరాజు 51,478 ఓట్లు సాధించి కాంగ్రెస్(ఐ) అభ్యర్థిని భూపతిరాజు కమలకాంత కస్తూరి (44,823)పై గెలుపొందారు. 1999లో టీడీపీ అభ్యర్థి పి.వి.నరసింహరాజు 71,502 ఓట్లు సాధించి కాంగ్రెస్(ఐ) అభ్యర్థి వేగిరాజు రామకృష్ణంరాజు (44,823)పై గెలుపొందారు. 1999 వరకు 11 దఫాలు జరిగిన ఎన్నికల్లో నాచు వెంకట్రామయ్య తప్పించి అందరూ క్షత్రియ సామాజిక వర్గం వారే ఎన్నికయ్యారు. 2004 నాటి ఎన్నికలకు భీమవరం నియోజకవర్గంలోని పాలకోడేరు మండలం ఉండి నియోజకవర్గ పరిధిలోకి వెళ్లిపోవంతో క్షత్రియ సామాజిక వర్గం హవాకు గండి పడింది. తదుపరి వీరవాసరం మండలం, భీమవరం రూరల్ తుందుర్రు, తుందుర్రు శివారు గ్రామాలు, వెంప, వెంప శివారు గ్రామాలు భీమవరం నియోజకవర్గంలో కలవడం నియోజకవర్గం స్వరూపం మారిపోయింది. కాపు, కాపు ఉప కులాల ఓట్లు సుమారు 90,000కు చేరడంతో వారే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారనడంలో ఎటువంటి సందేహంలేదని విశ్లేషకుల అభిప్రాయం.

– విశాలాంధ్ర-భీమవరం

ఎన్నికల బరిలో సినీతారలు



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తారలు తళుక్కుమంటున్నారు. ఇప్పటికే కొందరు రాజకీయాల్లో సత్తా చాటారు. మరికొందరు పతా లేకుండా పోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో చిత్ర పరిశ్రమకు, రాజకీయ రంగానికి అవినాభావ సంబంధముంది. అనేకమంది నటులు, నిర్మాతలు ఎన్నికల్లో పోటీ చేశారు. పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు 2014లో జరిగిన తొలి ఎన్నికల్లోనూ ప్రముఖ నటులు పోటీ చేశారు. తాజా ఎన్నికల్లోనూ వివిధ పార్టీల తరపున పోటీకి అనేకమంది తారలు సిద్ధమయ్యారు.

ప్రముఖ హీరో పవన్ కల్యాణ్ 2014లో జనసేన పార్టీని స్థాపించారు. అదే ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఎన్డీయే కూటమి (బీజేపీ, టీడీపీ)కి మద్దతిచ్చారు. 2019 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి నుంచి విడిపోయారు. గాజువాక, భీమవరం అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో ఎన్డీయే కూటమితో పవన్ పార్టీ జతకట్టింది. పదేళ్ల క్రితం జనసేన ఏర్పాటైనప్పటికీ, ఆయన ప్రభావం ఎక్కడా కన్పించలేదు. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ఈసారి పోటీ చేయనున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇప్పటికే పిఠాపురంలో ప్రచారాన్ని ప్రారంభించారు. పవన్ కల్యాణ్‌కు దీటుగా వైసీపీ తరపున కాకినాడ సిట్టింగ్ ఎంపీ వంగా గీత బరిలో నిలిచారు. ఈమె గతంలో పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గానూ ఎంపికయ్యారు. స్థానికులతో ఆమెకు సత్సంబంధాలున్నాయి. వంగా గీతా మీద పవన్ కల్యాణ్ గెలవడం ప్రశ్నార్థకంగా మారింది.

నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తనయుడు నందమూరి బాలకృష్ణ సత్యసాయి జిల్లా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 2014, 2019 ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. హిందూపురం నుంచి మూడో సారి పోటీ చేస్తున్నారు. ఈయన హ్యాట్రిక్ కొడతారా, లేదా అనేదీ ఫలితాలు వచ్చాకే తేలనున్నది. బాలకృష్ణకు దీటుగా వైసీపీ తరపున బీసీ మహిళా అభ్యర్థి దీపిక నిలబడ్డారు. దీంతో టీడీపీ, వైసీపీ మధ్య రసవత్తర పోరు సాగబోతోంది. గత ఎన్నికల్లో బాలకృష్ణపై పోటీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ఓటమి పాలయ్యారు. ఆయన ఇప్పుడు టీడీపీలో ఉన్నారు. హిందూపురం 1983 నుంచి టీడీపీకి కంచుకోటగానే ఉంది. తాజా రాజకీయ సమీకరణలతో హిందూపురం అసెంబ్లీ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఆర్కే రోజా తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో 100కుపైగా చిత్రాల్లో నటించారు. బుల్లితెర నటిగానూ పేరు తెచ్చుకున్నారు. 2014, 2019 ఎన్నికల్లో నగరి నుంచి వైసీపీ తరపు పోటీ చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2022 జరిగిన ఏపీ మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆమెకు క్రీడలు, పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు లభించాయి. తాజా ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న రోజా హ్యాట్రిక్ కొడతారా అనేది వేచిచూడాలి. సొంత పార్టీలో వర్గ విభేదాలు ఆమెను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితులు టీడీపీకి కలిసి వచ్చే అవకాశాలు లేకపోలేదు.

వైసీపీ ఎంపీ, ప్రస్తుత రాజమండ్రి ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌కూ చిత్రరంగంతో సంబంధమున్నది. 2017లో 'ఓయ్ నిన్నే' అనే చిత్రంలో హీరోగా నటించారు. 2019లో రాజమండ్రి లోక్‌సభ స్థానానికి వైసీపీ తరపున పోటీ చేసి గెలిచారు. ఎంపీ అయ్యారు.

– విశాలాంధ్ర బ్యూరో-అమరావతి

రద్దయి, మళ్లీ రూపుదిద్దుకున్న విజయనగరం

విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం 1952లో ఉన్నది. ఆ తరువాత ఆ నియోజకవర్గం రద్దు అయింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో లోక్‌సభ నియోజక వర్గంగా తిరిగి రూపుదిద్దుకుంది. 1967లో బొబ్బిలి నియోజకవర్గం ఏర్పాటై 2008 ఉప ఎన్నిక తరువాత రద్దు అయి ప్రస్తుతం విజయనగరం నియోజకవర్గంగా కొనసాగుతోంది. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల నుంచి పూసపాటి రాజవంశీకులు ముగ్గురు గెలుపొందడం విశేషం. 1977, 1980 ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గం నుంచి గెలుపొందిన పూసపాటి విజయరామ గజపతి రాజు కుమారులు పూసపాటి ఆనంద గజపతి రాజు 1984, 1991 ఎన్నికల్లో బొబ్బిలి నుంచి, పూసపాటి అశోక్ గజపతి రాజు 2014 ఎన్నికలలో విజయనగరం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.



మా ఊరిలోనే బూత్ పెట్టండి

- గిరిజన మహిళల డిమాండ్
- సమీప పోలింగ్ బూత్ వరకు 'డోలీ' యాత్ర

ప్రతి ఓటు విలువైనదని చెప్పే ఎన్నికల సంఘానికి తమ విషయంలో నిర్లక్ష్యం ఎందుకని గిరిజన గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మారుమూల, గిరి గ్రామాల్లో ఉండే తామంతా కొండపై నుంచి కిందకు వచ్చి ఓటు వేయాలంటే ప్రహసనమే అవుతోందని చెప్పుకొచ్చారు. పదుల కిలోమీటర్లు ప్రయాణించి వెళ్లి ఓటు వేసే పరిస్థితి తమకు ఎందుకని ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు ఉండే పంచాయతీ కేంద్రాల్లో ఓటింగ్‌కు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని సూచించారు. తమ పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రం కోసం డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్, అనకాపల్లి జిల్లా, చోడవరం నియోజకవర్గం, ఆర్లా పంచాయతీ పరిధిలోని గిరిజన సంఘాల (పీవీటీజీలు) మహిళలు 'డోలీ' యాత్రను సమీప గ్రామంలోని పోలింగ్ కేంద్రం వరకు నిర్వహించారు. కనీసం 15కిమీలు కాలినడకన వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితిని నిరసించారు. 2019 ఎన్నికల్లో పిట్రీగడ్డ, నీలు బండా, పెద్ద కరువు, కొట్టాలోసింగి, పటాలోసింగి, ఆర్లా వంటి గిరిగ్రామాల ప్రజలు 15 కిమీల దూరంలోని గుర్రాల బైలు, గడబాపాలెం, సరాభవరం పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో ఓటేశారు. అయితే 2020లో ఆర్లా పంచాయతీ కొత్తగా ఏర్పాటు కావడంతో ఆపై పంచాయతీ ఎన్నికలు స్థానికంగా జరగడంపై గ్రామీణ గిరిజనులు హర్షం వ్యక్తంచేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు జరగనుండటంతో, తిరిగి 15కిమీల దూరంలోని సరాభవరం కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని వసతులు ఉన్న ఆర్లా పంచాయతీలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించేందుకు కావాల్సిన స్కూలు భవనం, మంచి నీటి వసతి వంటి అన్ని సదపాయాలు ఈ పంచాయతీలో ఉన్నాయన్నారు.

2020లో వలే ఈసారి కూడా ఇక్కడే ఓటు వేసేలా వసతి కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. మూడు కిమీలలోపు 600 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రత్యేక బూత్ ఏర్పాటు చేయిచ్చని ప్రధాన ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల్లో ఉంటే... అధికారులు ఆ నిబంధనను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిరసనకారులు ప్రశ్నించారు. కొండ దిగి కిలోమీటర్లు నడిచి బూత్‌కు చేరుకుంటే తమ ఓటును అప్పటికే వేసేశారని తెలిసి అనేకమార్లు వెనుదిరిగినట్లు గుర్తుచేశారు. ఇటువంటి పరిస్థితులు ఈసారి ఎన్నికలప్పుడు ఎదురు కాకుండా చూడాలని ఎన్నికల సంఘానికి విన్నవించారు. అర్లా పంచాయతీలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తమకు ఓటేసే సౌకర్యం కల్పించాలని ఈసీని డిమాండ్ చేశారు.

పేదల ఎర్రదొర పూల సుబ్బయ్య

ఆదర్శ ప్రతినిధి

ఆయన పేదల మనిషి. వెలుగొండ ప్రాజెక్టు ఉద్యమానికి ఆద్యుడు. ప్రకాశం జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ నిర్మాణ దక్షుల్లో ఒకరు. ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలుపొంది ప్రజల కోసమే పదవిని ఉపయోగించి నేటి తరానికి ఆదర్శనీయులుగా నిలిచారు. ఆయనే ఆదివాసీలు ఆప్యాయంగా పిలుచుకునే 'ఎర్రదొర' కామ్రేడ్ పూలసుబ్బయ్య. 1929 జూన్ 29న ప్రకాశం జిల్లాలోని కంభంలో సాధారణ కుటుంబంలో పూలసుబ్బయ్య జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి వెంకటపతిని కోల్పోయారు. తల్లి సుబ్బమ్మ ఎంతో కష్టపడి ఆయన్ని చదివించారు. 1946-49లో కాలేజీ విద్యను గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో పూర్తిచేశారు. 1949లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)లో సభ్యుడిగా ఉన్నారు. 1950లో తురిమెళ్లలో కమ్యూనిస్టు నాయకులు బెల్లంకొండ శాయన్న, వెంకట రంగయ్య ప్రారంభించిన ఎయిడెడ్ హైస్కూలులో సంవత్సరంపాటు హెడ్మాష్టరుగా పనిచేశారు. 1952-53లో 'బెల్గాం'లో లా చదివారు. లా కళాశాల విద్యార్థి యూనియన్ జనరల్ సెక్రటరీగాను వుంటూ విద్యార్థుల్లో అభ్యుదయ భావాలను పెంపొందించడానికి కృషి చేశారు. ఆ కాలంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆయన తురిమెళ్లలో ఉండగానే కమ్యూనిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. అప్పట్లో రహస్య జీవితం గడుపుతున్న కమ్యూనిస్టు నాయకులు అక్కడికి వస్తుండేవారు. సుబ్బయ్య వారితో చర్చలు జరిపేవారు. అక్కడే ఆయన మనసులో కమ్యూనిస్టు బీజాలు పడ్డాయి. మార్కాపురం పట్టణంలో లాయరుగా వుంటూ తాలూకాలో వున్న అతివాద యువకులను పార్టీలోకి సమీకరించారు. 1956 నుంచి మార్కాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగాను, తర్వాత జిల్లా పార్టీలోనూ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శిగానూ ఆయన పనిచేశారు. 1960లో మార్కాపురం పలకల కార్మికుల సంఘం అధ్యక్షుడిగా సమర్థమంతంగా బాధ్యతలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంలో తాలూకా పార్టీ ప్రథమ మహాసభ జరిగింది. సుబ్బయ్య కార్యదర్శిగా ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. 1962, 1967ల్లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ఎర్రగొండపాలెం (అప్పట్లో కర్నూలు జిల్లా) నుంచి, 1978లో మార్కాపురం నుంచి పోటీచేసి గెలుపొందారు. సభలో ప్రతి అంశం పైనా స్పందిస్తూ చాలా చురుగ్గా ఉండే వారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ ఎప్పుడూ రాజకీయాలకతీతంగా ఆయన్ను కలవడానికి వచ్చిన అన్ని పార్టీల జనంతో సందడిగా ఉండేది. సాగు, తాగు నీటి సౌకర్యాలు లేక కరవు తాండవిస్తున్న ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి కృష్ణా జలాలను తరలించాలని ఆయన పెద్దఎత్తున ఉద్యమాలు నడిపారు. ఆయన కృషి ఫలితంగానే ఎన్టీఆర్ హయాంలో వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభమైంది. ఆ విధంగా ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల అభివృద్ధికి పాటుపడిన పూల సుబ్బయ్య 1988 జూన్ 23న అనారోగ్యంతో కన్ను మూశారు. ఆ తర్వాత ప్రాజెక్టు కోసం అహర్నిశలు కృషి చేసిన పూలసుబ్బయ్య పేరునే దానికి పెట్టాలని సీపీఐ నాయకులు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిసి మెమోరాండం ఇచ్చారు. దాంతో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు అని పేరు పెట్టడం గమనార్హం. శాసనసభ్యుడిగా, రైతుసంఘ ఉద్యమాల్లో ప్రముఖపాత్ర వహించిన పూలసుబ్బయ్య కాంస్య విగ్రహాన్ని మార్కాపురం బస్టాండు సెంటర్లో ప్రతిష్ఠించడం..సామాన్య ప్రజలు, రైతులు, కూలీల హృదయాల్లో ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనం.